ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 07.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 346 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ రేసులో సంజూ శాంసన్ 12

ఇరాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం

50 యుద్ధ విమానాలతో దాడులు

ఖమేనీ రహస్య బంకర్‌ను ధ్వంసం చేసిన ఐడీఎఫ్

- ఇరాన్ డ్రోన్ వాహక నౌకను పేల్చేసిన అమెరికా
- జోర్డాన్, యూఏఈ రాడార్లపై ఇరాన్ దాడి
- బేషరతుగా లొంగిపోవాలి.. అప్పుడే చర్చలు : ట్రంప్
- యుద్ధంలో 200 మంది చిన్నారులు మృతి : యూనిసెఫ్
- రష్యా నుంచి చమురు కొనుగోలు చేసుకోండి
- భారత్‌కు అమెరికా 30 రోజులు మినహాయింపు

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

ఇజ్రాయెల్ ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తోంది. ప్రతిగా ఇరాన్ కూడా తన దాడులను కొనసాగిస్తోంది. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులతో పశ్చిమాసియాలో వారం కిందట మొదలైన ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఇటీవలి అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ అధ్యక్ష కార్యాలయం కిందనున్న రహస్య బంకరే లక్ష్యంగా శుక్రవారం ఉదయం ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. 50 యుద్ధ విమానాలతో ఆ బంకర్‌ను తునాతునకలు చేశాయి. ఖమేనీ మృతి తర్వాత ఈ బంకర్‌ను ఉన్నతాధికారులు వినియోగించే అవకాశం ఉన్నదని, అందుకే దాన్ని ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు, ఇరాన్ డ్రోన్ వాహక నౌక లక్ష్యంగా అమెరికా భీకర దాడులు జరిపింది. దీంతో పెద్దయెత్తున మంటలు చెలరేగాయి. దాడుల

...:: మిగతా 2లో

మీ అభివృద్ధి, సంక్షేమమే నా ధ్యేయం

ఈ ప్రజా పాలన ప్రభుత్వం మీది

ఎన్ని చిక్కులున్నా వెనకడుగు వేయలేదు

> ఈ ప్రభుత్వం మీది.. మీ అభివృద్ధి, సంక్షేమమే నా ధ్యేయం.. ప్రజా పాలన రావాలి, ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్న బలమైన ఆకాంక్షతో 2023 ఎన్నికల్లో కష్టపడి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. 2023 లో మా దగ్గర అధికార యంత్రాంగం, అక్రమ సంపాదన లేదు. అక్రమ కేసులు, అక్రమ సంపాదనతో ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న వారు ఒక వైపు, చచ్చినా సరే ఎన్నికల్లో గెలవాలని చిత్తశుద్ధి తో మేం చేసిన ప్రయత్నం మరోవైపు. మాటలు, మూటలతో అయితే మేం ఎన్నికల్లో గెలిచేవాళ్లం కాదు. ప్రజల పక్షాన నిలబడ్డాం. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని గెలిపించారు.
>
> \- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఎస్సీ వర్గీకరణ అమలు
- మాటలు, మూటలతో గెలువలేదు
- ప్రజల దీవేనలతో ప్రభుత్వం ఏర్పాటు
- బలహీన వర్గాల పక్షాన నిలబడటం నా ధర్మం
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో అభినందన సభ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 6 : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మాదిగ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పకాల వేదికలో అభినందన సభ నిర్వహించారు. సన్మాన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం మీది...మీరంతా కోరుకుంటే, ప్రజా పాలన రావాలి, ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్న బలమైన ఆకాంక్షతో 2023 ఎన్నికల్లో కష్టపడి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని తెలిపారు. 2023 లో మా దగ్గర అధికార యంత్రాంగం, అక్రమ సంపాదన లేదు.. అక్రమ కేసులు, అక్రమ సంపాదనతో ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న వారు ఒక వైపు, చచ్చినా సరే ఎన్నికల్లో గెలవాలని చిత్తశుద్ధితో మా ప్రయత్నం మరోవైపు అని తెలిపారు. మాటలు, మూటలతో అయితే మేం ఎన్నికల్లో గెలిచేవాళ్లం కాదు. ప్రజల పక్షాన నిలబడ్డాం... ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, దీంతో రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతున్నదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎస్సీ వర్గీకరణ

...:: మిగతా 2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.30 (శనివారం సాయంత్రం)

సహర్ – 5.08 (ఆదివారం ఉదయం)

లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాసం.. ఎంపీలకు విప్

వచ్చే వారం లోక్‌సభలో స్పీకర్‌పై కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం పెట్టబోతుంది. ఈ నేపథ్యంలో ఈ తీర్మానంపై ఉత్కంఠ నెలకొంది. అందుకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి.

11

దేశ అభివృద్ధికి అంతర్గత భద్రత ముఖ్యం

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారాలంటే అంతర్గత భద్రత చాలా కీలకమని అమిత్ షా పేర్కొన్నారు. దేశంలోని కీలక ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్ దళాలు పటిష్ఠ భద్రతను కల్పిస్తూ ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తున్నాయని చెప్పారు.

11

మూసీ' ప్రాజెక్టులో ఎవరినీ అనాథలను చేయం

భూమి, ఇండ్లు పోయినా ప్రభుత్వం ఆదుకుంటుంది

- నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం
- మూసీపూర్తిగా మురికితో నిండిపోయింది
- ప్రజలెవరూ మురికిలో బతకాలని కోరుకోరు
- అందరినీ మెప్పించి, ఒప్పించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- కొత్వాలగూడలో ఎకో పార్క్‌ను ప్రారంభం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 6 : మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి ప్రణాళికల్లో నిర్వాసితులు ఎవరికీ నష్టం జరగకుండా అందరినీ ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "కొత్త ప్రాజెక్టులు వచ్చినప్పుడు కొందరికి ఇబ్బంది ఉండొచ్చు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో ఎవరినీ అనాధలను చేయం. భూమి పోయినా, ఇండ్లు పోయినా ప్రభుత్వం మంచి నష్టపరిహారమిచ్చి ఆదుకుంటుంది. నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం" అని చెప్పారు. బుద్వేల్ లేఅవుట్‌తో కలిపే రేడియల్ రోడ్ 2 ఇంటర్‌చేంజ్‌కు ముఖ్యమంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్వాలగూడలో ఎకో పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి

...:: మిగతా 2లో

ప్రజాపాలన ప్రగతికి సరికొత్త బాట

- 99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలి
- రెవెన్యూ - అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం

మార్చి 6 : ప్రజలకు మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని దిశానిర్దేశం

...:: మిగతా 2లో

మక్క రైతులకు డబ్బులు విడుదల

- మూడు రోజుల్లో అకౌంట్లోకి డబ్బులు
- రూ.171 కోట్లు విడుదల
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటన

మొక్కజొన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెండు, మూడు రోజుల్లో రైతుల అకౌంట్లో నగదు జమ కానున్నాయి.

...:: 5లో

స్వామివారి దయతో మనోవేదన తొలగిపోయింది

- సత్యం, న్యాయం, ధర్మం నా వైపు ఉన్నాయని ఎప్పటి నుంచో చెబుతూ వచ్చా
- స్వామివారి ఆశీస్సులతో పూర్తిగా క్లీన్ చిట్ పొందా
- అందుకే కాలినడకన వచ్చి మొక్కు చెల్లించుకున్నా
- రెండు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలి
- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కవిత

ప్రతిపక్షం ప్రతినిధి, తిరుపతి

మార్చి 6: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆమె తన భర్త

...:: మిగతా 2లో

తెలంగాణ డబ్బుతో కేరళలో కాంగ్రెస్ ప్రచారం

- అమలు కాని పథకాలు అమలవుతున్నట్లు తప్పుడు ప్రచారం
- ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పారు
- "ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక" పేరుతో మరో ప్రచార డ్రామా
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 6: తెలంగాణ ప్రజాధనాన్ని ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి వినియోగిస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనాయకుడు హరీష్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని చెబుతున్న ప్రభుత్వం, పక్క రాష్ట్రం కేరళలో మాత్రం వందల కోట్ల రూపాయలను ఫుల్ పేజీ ప్రకటనల రూపంలో ఖర్చు చేస్తోందని ఆయన ఆరోపించారు. కేరళ ఎన్నికల నేపథ్యంలో అక్కడి మలయాళ పత్రికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంల

...:: మిగతా 2లో

16 యేండ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సంచలన ప్రకటన చేశారు. రాష్ట్రంలోని 16 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

11

రాష్ట్రీయం

మీ అభివృద్ధి, సంక్షేమమే నా ధ్యేయం

మొదటిపేజీ తరువాయి

కోసం దశాబ్దాలుగా పోరాటం కొనసాగిందని గుర్తుచేశారు. ఈ పోరాటంలో అనేక మంది తమ ప్రాణాలు కూడా అర్పించారని, ఆ త్యాగాలకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావించామని తెలిపారు. "సుప్రీంకోర్టు తీర్పు తర్వాత వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ. బలహీన వర్గాల పక్షాన నిలబడటం నా కర్తవ్యంగా భావించాను" అని స్పష్టం చేశారు. మహాభారతంలోని కర్ణుడు, బర్బరీకుడు పాత్రలను ఉదాహరణగా ప్రస్తావించిన సీఎం, బలహీనుల పక్షాన నిలబడటమే నిజమైన ధర్మమని అన్నారు. రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా మాదిగల హక్కుల విషయంలో వెనక్కి తగ్గలేదని చెప్పారు. 'దళితుల హక్కులను కాపాడటానికి, వాటిని చట్టబద్ధం చేసి రక్షణ కల్పించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. వచ్చే అంబేద్కర్ జయంతికి మాదిగల ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తాం. భవిష్యత్తులో మాదిగలకు ఏం కావాలో చేయడానికి సిద్ధంగా ఉన్నాం. చట్టబద్ధమైన హక్కులను కాపాడుకోవడం మీ బాధ్యత. అప్రమత్తంగా ఉండాలి. ఎన్నో దశాబ్దాలకు పైగా ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశం నలిగింది. వర్గీకరణ సాధించాలన్న తపనతో పోరాటంలో కొంత మంది తమ ప్రాణాలను కోల్పోయారు. 20 ఏళ్ల నుంచి ఈ సమస్యను ప్రత్యక్షంగా చూశాను. ప్రతి సందర్భంలోనూ నా చేతన మేరకు సహాయం చేశాను. చిక్కుముడులు, కమిషన్లు, చర్చలు జరిగాయి. అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇచ్చినప్పుడు మమ్మల్ని బయటకు గెంటివేశారు.' అని సీఎం అన్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయాలి

ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి "కళ్లు, చెవులు, బ్రాండ్ అంబాసిడర్లు" అని పేర్కొన్న సీఎం, ప్రజలకు సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. "99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" ద్వారా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా అధికారులు కష్టపడి పనిచేయాలని సీఎం కోరారు.అత్యంత వెనుకబడిన మాదిగ సమాజం విద్య ద్వారా ముందుకు రావాలని పిలుపునిచ్చిన ఆయన, ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు డైట్ మరియు కాస్మోటిక్ చార్జీలను పెంచామని తెలిపారు."గతంలో బర్రెలు, గొర్రెలు ఇచ్చి జీవనోపాధి చూపించారు. కానీ ఇప్పుడు చెప్పులు కుట్టుకున్న జాతి ఈ రాజ్యాన్ని నడిపే స్థాయికి రావాలి. మాదిగ యువత కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు కావాలి" అని సీఎం పిలుపునిచ్చారు.సీఎంగా వచ్చిన అవకాశాన్ని ప్రజలకు సేవ చేయడానికే వినియోగిస్తానని, మాదిగల హక్కులను చట్టబద్ధంగా కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర్ రాజనరసింహ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య , వేముల వీరేశం, లక్ష్మికాంతరావు పాల్గొన్నారు.

స్వామివారి దయతో మనోవేదన తొలగిపోయింది

మొదటిపేజీ తరువాయి

అనిల్ తో కలిసి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గురువారం సాయంత్రం అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమలకు చేరుకున్న కవిత, శుక్రవారం ఉదయం స్వామివారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... గత నాలుగు సంవత్సరాలుగా తాను ఎదుర్కొంటున్న మనోవేదన స్వామివారి దయతో తొలగిపోయిందని తెలిపారు. సత్యం, న్యాయం, ధర్మం తమవైపు ఉన్నాయని తాను ఎప్పటి నుంచో చెబుతూ వచ్చానని, స్వామివారి ఆశీస్సులతో తాను పూర్తిగా క్లీన్ చిట్ పొందానని పేర్కొన్నారు. అందుకే కాలినడకన వచ్చి స్వామివారికి మొక్కు చెల్లించుకున్నానని చెప్పారు. తెలంగాణ ప్రజల పక్షాన "తెలంగాణ ఇంటి పార్టీ"గా పని చేసేలా రానున్న రోజుల్లో ఒక రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆ పార్టీకి స్వామివారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు వేరైనా ప్రజలు కలిసే ఉండాలని, రెండు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు కవిత తెలిపారు.

తెలంగాణ డబ్బుతో కేరళలో కాంగ్రెస్ ప్రచారం

మొదటిపేజీ తరువాయి

ఫోటోలతో ఫుల్ పేజీ ప్రకటనలు ఇవ్వడం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఖజానా ఏటీఎంలా మారిందని హరీశ్ రావు అన్నారు. ఇక్కడ అమలు కాని పథకాలను కేరళలో అమలవుతున్నట్లు చూపిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆయన ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని చెప్పిన మహాలక్ష్మి పథకం అమలు కాలేదని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇవ్వాలని చెప్పి ఆచరణలోకి తీసుకురాలేదని, కాలేజీ విద్యార్థులకు స్కూటీలు ఇవ్వాలన్న హామీ కూడా నెరవేర్చలేదని అన్నారు. తెలంగాణలో మహిళలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోయినా, కేరళలో మాత్రం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేశామని ప్రకటనలు ఇస్తున్నారని విమర్శించారు.

ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పారు

నిరుద్యోగ యువతకు అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆయన అన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపట్టిన విద్యార్థులపై అశోక్ నగర్ వీధుల్లో, ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో అర్ధరాత్రి లాఠీచార్జ్ చేయించారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన ప్రభుత్వం కేరళలో మాత్రం తెలంగాణలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించామని అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. విద్యాశాఖ నిధులను కూడా ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేకపోయినా ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలకు విద్యాశాఖ ఖాతాల నుంచి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. రైతుల సమస్యలపైనా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని అన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని హరీశ్ రావు పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే మొదటి నెల నుంచే రూ.4,000 పెన్షన్ ఇస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు.

99 రోజుల ప్రణాళిక పేరుతో కొత్త డ్రామా

ఇక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. రెండున్నరేళ్ల పాలనలో ఏం చేయలేకపోయిన ప్రభుత్వం ఇప్పుడు 99 రోజుల ప్రణాళిక పేరుతో కొత్త డ్రామాకు తెరతీసిందని అన్నారు. ఇది పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు తీసుకొచ్చిన డైవర్షన్ ప్లాన్ మాత్రమేనని విమర్శించారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు ఇప్పటికీ పరిష్కారం కాక చెత్తబుట్టల్లోనే పడి ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఆ సమస్యలను పరిష్కరించకుండా మళ్లీ పది వారాల పాటు పది రకాల కార్యక్రమాలతో ప్రజలను మోసం చేయాలని ప్రభుత్వం చూస్తోందని అన్నారు. ప్రజాధనాన్ని ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి వినియోగించడం తక్షణమే నిలిపివేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఇప్పటికే కేరళ పత్రికల్లో ఇచ్చిన ప్రకటనల కోసం ఖర్చు చేసిన వందల కోట్ల రూపాయలను కాంగ్రెస్ పార్టీ ఖాతా నుంచి ప్రభుత్వ ఖజానాకు తిరిగి చెల్లించాలని ఆయన కోరారు.

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

- కౌన్సిలర్ శోభన్‌బాబు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేత

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 6: హుస్నాబాద్ పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం కళ్యాణ లక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 20వ వార్డు కౌన్సిలర్ గోపగోని శోభన్‌బాబు ఆధ్వర్యంలో 20వ వార్డుకు చెందిన సంగ్యం కావ్య, ఆడేపు వాణి,కొయాద హర్షిత, మంథేన నిఖిత నలుగురు లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు.కార్యక్రమానికి పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షత వహించి లబ్ధిదారులకు చెక్కులను అందించారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ మల్లికార్జున, ఎంఆర్వో లక్ష్మారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మతో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇరాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం

మొదటిపేజీ తరువాయి

అనంతరం స్పందించిన అమెరికా సెంట్రల్ కమాండ్.. ఇరాన్ నేవీ మొత్తాన్ని నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు వెల్లడించింది. ఇప్పటివరకూ ఇరాన్‌లోని 200 లక్ష్యాలను ధ్వంసం చేసినట్టు అమెరికా ప్రకటించింది. మరోవైపు, ప్రస్తుత యుద్ధం మరో దశకు చేరిందని, ఇరాన్‌పై మరిన్ని మెరుపు దాడులు చేయనున్నట్టు ఐడీఎఫ్ చీఫ్ అయాల్ జమీర్ హెచ్చరించారు. లెబనాన్‌లోని హెజ్బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు జరిపింది.

జోర్డాన్, యూఏఈ రాడార్లపై ఇరాన్ దాడి

అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా గల్ఫ్ దేశాలపై డ్రోన్లతో విరుచుకుపడింది. జోర్డాన్, యూఏఈలోని రాడార్ కేంద్రాలను ధ్వంసం చేసింది. అంతకుముందు ఖతార్‌లోనూ అత్యంత శక్తివంతమైన రాడార్ కేంద్రాన్ని కూడా పేల్చేసింది. ఇరాక్‌లోని ఎర్బిల్ ఎయిర్‌పోర్టుకు సమీపంలోని అమెరికా మిలిటరీ స్థావరంతో పాటు కువైట్‌లోని మరో అమెరికా స్థావరంపై దాడులు చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. కువైట్ , బహ్రెయిన్ రాజధాని మనామాలో పెద్ద యెత్తున పేలుడు శబ్దాలు వినిపించినట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఇదిలాఉండగా టెల్ అవీవ్ నగరం మీదుగా ఇరాన్ ఖైబర్, ఫాటా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీంతో టెల్ అవీవ్ నగరంలో రోజంతా సైరన్లు మోగాయి. ఇజ్రాయెల్‌లోని బెన్ గురియాన్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఇరాన్ క్షిపణితో దాడులు జరిపిందని స్థానిక మీడియా పేర్కొన్నది. తమ దేశంలోకి చొరబడాలని ప్రయత్నిస్తే దాడులకు వెనుకాడబోమని ఇరాక్‌లోని కుర్దీషియన్లకు ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి దాదాపు 200 మంది చిన్నారులు మరణించారని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్‌లో అత్యధికంగా 181 మంది మృతి చెందినట్టు వెల్లడించింది. ఇరాన్‌లో 3000 ఇండ్లు నాశనమైనట్టు ఇరానీయన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలిపింది.

గత నవంబర్‌లోనే..

ఖమేనీని అడ్డు తొలగించాలని తాము గత నవంబర్‌లోనే నిర్ణయించినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ తెలిపారు. ప్రస్తుతం ఇరాన్‌పై కొనసాగుతున్న సైనిక చర్య 2026 మధ్యలో జరుగాల్సి ఉన్నదని, అయితే, ఇరాన్ పాలనకు వ్యతిరేకంగా నిరసనలు పెరుగడంతో ఆపరేషన్‌ను ముందస్తుగా చేపట్టినట్టు వెల్లడించారు. ఇరాన్‌పై పని ముగించిన తర్వాత క్యూబా సంగతి తేల్చుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. క్యూబాతో అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి తీవ్రమైన ముప్పు పొంచి ఉన్నట్టు తెలిపారు. తమ దాడులతో ఇప్పటికే ఇరాన్ సైనిక సామర్థ్యాలు భారీగా క్షీణించాయన్నారు.

ఇరాన్‌కు రష్యా ఇంటెల్

మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలు, యుద్ధనౌకలు, యుద్ధ విమానాలు ఎక్కడెక్కడ ఉన్నాయన్న రియల్ టైమ్ సమాచారాన్ని ఇరాన్‌కు రష్యా చేరవేస్తున్నదని, ఈ క్రమంలోనే ఇరాన్ కచ్చితత్వంతో వాటిపై దాడులు చేయగలుగుతున్నదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు ముగ్గురు అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ ఒక కథనంలో వెల్లడించింది.

బేషరతుగా లొంగిపోవాల్సిందే: ట్రంప్

బేషరతుగా లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్‌తో యుద్ధం తీవ్రవుతున్న క్రమంలో ఆ దేశం పట్ల తనకున్న కఠిన వైఖరిని ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఏదైనా దౌత్య మార్గం ఏర్పడటానికి ముందు టెహ్రాన్ లొంగిపోవాల్సి ఉంటుందన్నారు. 'ఆ దేశానికి గొప్ప, ఆమోదయోగ్యమైన నాయకుడి ఎంపిక తర్వాత మేము, మా మిత్రులు, భాగస్వాములు కలిసి ఇరాన్‌ను విధ్వంసం అంచు నుంచి తిరిగి తీసుకురావడానికి అవిశ్రాంతిగా కృషి చేస్తాం' అని ఆయన అన్నారు. కాగా, దౌత్యపరమైన మార్గాల పట్ల ఇరాన్ ఇంకా ఆశాభావంతో ఉంది. ఇరాన్‌అమెరికా మధ్య యుద్ధాన్ని ముగించడానికి కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తున్నాయని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజిష్కియాన్ తెలిపారు.

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసుకోండి- భారత్‌కు అమెరికా 30 రోజులు మినహాయింపు

రష్యా నుంచి 30 రోజుల పాటు చమురు కొనుగోలు చేసేందుకు అమెరికా, భారత్‌కు తాత్కాలిక మినహాయింపు ఇచ్చింది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల కారణంగా ఇప్పటికే చమురు, గ్యాస్ ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇంధన సరఫరా వ్యవస్థలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి రష్యా చమురు కొనుగోలు చేసేందుకు భారత్‌కు తాత్కాలిక మినహాయింపు ఇస్తున్నట్లు రాసుకొచ్చారు. ఇప్పటికే సముద్రంలో చిక్కుకున్న రష్యా చమురు నౌకల నుంచి మాత్రమే కొనుగోళ్లు చేయాలని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ స్పష్టంచేశారు. ఫలితంగా రష్యాకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరదన్నారు. అమెరికాకు భారత్ ముఖ్యమైన భాగస్వామి అని బెసెంట్ వెల్లడించారు. భవిష్యత్తులో అమెరికా ముడిచమురు కొనుగోళ్లను భారత్ పెంచుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

మూసీ' ప్రాజెక్టులో ఎవరినీ అనాథలను చేయం

మొదటిపేజీ తరువాయి

మాట్లాడారు. "మూసీనది పూర్తిగా మురికితో నిండిపోయింది. కానీ ఇప్పుడు కాలం మారింది. భవిష్యత్తు మారుతోంది. అందుకు అనుగుణంగా మహానగరానికి ప్రణాళికలు మార్చుకోవాలి. ప్రజలు ఎవరూ మురికిలో బతకాలని కోరుకోరు. విధిలేక మురికికూపాల్లో నివసిస్తున్నారు. ఆ పరిస్థితి నుంచి బయటకు తీసుకురావాలి. పేదల గురించి ఆలోచించి అందరినీ మెప్పించి, ఒప్పించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం. ఈ అభివృద్ధిలో ఇక్కడి వారందరినీ భాగస్వామ్యం చేస్తాం. ఎక్కడ ఉన్న వాళ్లకు అక్కడే ఇండ్లు కట్టించడానికి ఏర్పాటు చేస్తాం." అని సీఎం అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు కట్టాలన్నా, రేడియల్ రోడ్లు వేయాలన్నా, బుల్లెట్ ట్రైన్ నిర్మించాలన్నా, ఎవరిదో ఒకరిది భూమి కోల్పోవాల్సిన పరిస్థితి ఉంటుంది. భూమి కోల్పోయిన దుఃఖం ఉంటది. కానీ వేరే దగ్గర భూమి కొనుక్కునేంతగా నష్టపరిహారం ఇచ్చే బాధ్యత నాది అని పేర్కొన్నారు. అహ్మదాబాద్‌లో సబర్మతీ నది రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్, ఉత్తరప్రదేశ్‌లో గంగానది రివర్ ఫ్రంట్ ఎలాగైతే అభివృద్ధి చేశారో, హైదరాబాద్‌లో మూసీనది రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసుకుంటున్నాం. దీని చుట్టూ రాత్రి పూట వ్యాపారాలు చేసుకునే ఏర్పాట్లు చేస్తామని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శాంతిభద్రతలను పటిష్టం చేస్తామిని, నైట్ టూరిజంకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భూములు కోల్పోయే వారికి ఆయా నియోజకవర్గాల్లోనే ప్రభుత్వ స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని అన్నారు. 'గొప్ప గొప్ప చారిత్రక కట్టడాలతో ప్రపంచంలోనే అందమైన నగరంగా హైదరాబాద్ విలసిల్లింది. అలాంటి హైదరాబాద్ మహా నగరం చెత్త చెదారంతో నిండిపోయిందన్న వరకు తెచ్చారు. ఇప్పుడు హైదరాబాద్‌ను తిరిగి అద్భుతంగా తీర్చిదిద్దాలనుకుంటే కొందరు అడ్డుకుంటున్నారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీలతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించే సమయంలో కూడా కొందరికి నష్టం జరిగింది. కానీ అదే విమానాశ్రయం ఇప్పుడు పెద్ద ఆస్తిగా మారింది. చిన్న కాలనీలు కాకుండా పెద్ద నగరమే నిర్మించాలన్న లక్ష్యంతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. శంషాబాద్ ప్రాంతం బుల్లెట్ ట్రెయిన్ హబ్‌గా మారనుంది. బెంగుళూరు, అమరావతి, చెన్నైలకు ఇక్కడి నుంచే బుల్లెట్ ట్రెయిన్ సౌకర్యాలు రాబోతున్నాయి. దాదాపు అన్ని అనుమతులు వచ్చాయి. ట్రంప్, ఎలాన్ మస్క్ లకు సంబంధించిన సంస్థలు ఇక్కడికి రాబోతున్నాయి. ప్రపంచంలోనే గొప్ప నగరాన్ని ఇక్కడ నిర్మిస్తున్నాం. ఇది ప్రారంభమే. ప్రపంచంతోటి పోటీ పడే అభివృద్ధి ఇక్కడ జరుగుతుంది' అని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మల్లు రవి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్, మల్ రెడ్డి రంగారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాపాలన ప్రగతికి సరికొత్త బాట

మొదటిపేజీ తరువాయి

చేశారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గతంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాల్లో చోటుచేసుకున్న లోపాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో సరైన లెవల్స్ లేకపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోయి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేకంగా సమావేశమై, ఎక్కడైతే నీరు ఆగుతుందో ఆ ప్రాంతాలను గుర్తించి తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. అవసరమైతే లోపభూయిష్టమైన నిర్మాణాలను తొలగించి, కొత్తగా నిర్మించాలనిసూచించారు. ఏ అధికారి హయాంలో ఈ పొరపాట్లు జరిగాయో రికార్డుల్లో నమోదు చేసి, వారిని బాధ్యులను చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

అటవీ - రెవెన్యూ సరిహద్దు వివాదాలకు ముగింపు

ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అటవీ మరియు రెవెన్యూ భూముల వివాదాలను పరిష్కరించేందుకు ఈ 99 రోజుల ప్రణాళికను వేదికగా చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, వైరా వంటి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. కలెక్టర్లు, డి.ఎఫ్.ఓలు మరియు రెవెన్యూ యంత్రాంగం ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సరిహద్దులను ఖరారు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా నూటికి నూరు శాతం పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, మేయర్లు మరియు చైర్మన్లకు పాలనాపరమైన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అనుభవజ్ఞులైన అధికారులతో ఈ శిక్షణ ఇప్పించడం ద్వారా, గ్రామాల్లో నిధుల వినియోగంపై వారికి స్పష్టత వస్తుందన్నారు. ముఖ్యంగా గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ నిధులు ఇప్పుడు విడుదలవుతున్నాయని, వాటిని గ్రామాభివృద్ధికి పారదర్శక పద్ధతిలో ఖర్చు చేసేలా విలేజ్ సెక్రటరీలతో కలిసి పని చేయాలని సూచించారు. సాగు

ప్రభుత్వ ఖర్చుతో రైతులకు క్షేత్ర పర్యటనలు

వ్యవసాయ రంగంలో రైతులు విచక్షణారహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల ప్రభావం భూసారంపై పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రైతుకూ భూసార పరీక్షలు, పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులే నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఆధునిక సాంకేతికతను వివరించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల్లోని ఆదర్శ సాగు పద్ధతులను పరిశీలించేందుకు ప్రభుత్వ ఖర్చుతో రైతులకు క్షేత్ర పర్యటనలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

పార్టీలకు అతీతంగా ప్రజా సేవ

ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నా, గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులందరూ ప్రజల కోసమే పని చేయాలని మంత్రి ఉద్ఘాటించారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు



"

మిడిల్‌ఈస్ట్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి ముందుకొస్తున్నాయి. మేము శాంతికి కట్టుబడి ఉన్నాం. కానీ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు వెనుకాడబోం. మధ్యవర్తిత్వం వహించాలనుకుంటున్న దేశాలు యుద్ధం ప్రారంభించిన దేశాలపై దృష్టిసారించాలి.

- ఇరాన్ అధ్యక్షుడు మసాద్ పెజ్‌కియాన్

రాష్ట్రీయం

దళితుల సంక్షేమమే అజెండా

- పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యం
- 12న గాంధీభవన్లో బాధ్యతల స్వీకరణ
- టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కవ్వంపల్లి
- బీజేపీ దళితులను మోసం చేస్తుంది
- ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షులు రాజేంద్రపాల్ గౌతమ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 6: దళితుల సంక్షేమమే అజెండాగా, దళితులను అందరిని సంఘటితం చేసి కాంగ్రెస్ పార్టీని సంస్థగతంగా బలోపేతం చేస్తామని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీ భవన్ లో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షులు రాజేంద్ర పాల్ గౌతమ్, జాతీయ ఎస్సీ విభాగం సమన్వయకర్త శుక్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దళితులను అందరిని సంఘటితం చేసి కాంగ్రెస్ పార్టీని సంస్థగతంగా బలోపేతం చేస్తామన్నారు. ఈ నెల 12న టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ గా గాంధీభవన్ లో పదవీ బాధ్యతలు తీసుకుంటున్నానని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, అదే విధంగా దళిత మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, అన్ని దళిత సంఘాల నాయకులు హాజరవుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, రాష్ట్రంలోని దళితులంతా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏఐసీసీ జాతీయ ఎస్సీ విభాగం అధ్యక్షులు రాజేంద్ర పాల్ గౌతమ్ మాట్లాడుతూ దళితులకు విద్య అనేది చాలా ముఖ్యమైనదని, విద్య దళితులకు, బడుగు బలహీనవర్గాలకు అందని ద్రాక్షగా తయారయిందని అన్నారు. గత పన్నెండు సంవత్సరాల బీజేపీ పాలనలో బడ్జెట్లో విద్యకు కేవలం రెండు శాతం మాత్రమే నిధులు కేటాయిస్తుందన్నారు. అందువలన దళితులకి, బడుగు బలహీనవర్గాల పిల్లలకు స్కాలర్షిప్ లు కూడా ఇవ్వడం లేదని అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ రంగ విద్యాసంస్థలకు నిధులు ఇవ్వకుండా వాటిని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. తద్వారా పిల్లలు విద్యకు దూరమై కూలీ పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అచ్చుత రమేష్, టీపీసీసీ దళిత విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు మరియు ఉస్మానియా జాక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కుమారుడు అల్లు శిరీష్ వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. కొల్లూరు ఐనా ఈవెంట్ స్పేస్ లో జరిగిన వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. సీఎం వెంట మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ఉన్నారు. - ప్రతిపక్షం, హైదరాబాద్

చిత్రకారుడు అగాచార్య ను అభినందించిన మంత్రి పొన్నం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 6: శుక్రవారం మినిస్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రముఖ చిత్రకారుడు అగాచార్యను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్అభినందించారు. ఈ సందర్భంగా అగాచార్య తాను క్యాన్వాస్ పై చిత్రించిన తైలవర్ణ చిత్రాన్ని మంత్రికి బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన చిన్నతనం నుండి అగాచార్య పెయింటింగ్స్ చూస్తున్నానని, అందరిని ఆకట్టుకునే విధంగా పల్లె వాతావరణాన్ని అద్భుతంగా తన కుంచె ద్వారా చిత్రీకరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అగాచార్య వెంట ఆయన కుమారుడు వాసు, ప్రముఖ జర్నలిస్టు, రచయిత డా. పొన్నం రవిచంద్ర పాల్గొన్నారు.

నల్లచెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్

- సీఎం సభ ఏర్పాట్లపై సమీక్షించిన అధికారులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 6: కూకట్‌పల్లి నల్ల చెరువును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 9న సాయంత్రం నల్ల చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఒకప్పుడు కూకట్‌పల్లి నల్ల చెరువు పరిసరాలకు రావాలంటే వెనుకడుగు వేసేవారని, ఇప్పుడు చెరువు చుట్టూ చక్కర్లు కొడుతున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకుడు బండి రమేష్ అన్నారు. ఆక్రమణలు తొలగించి 16 ఎకరాలుగా మిగిలిపోతుందనుకున్న చెరువును 30 ఎకరాలకు విస్తరించి, సుందరంగా తీర్చిదిద్దడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ని శాలువతో సన్మానించారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, హైడ్రా డీసీపీ శ్రీకాంత్, ఏడీసీపీ సుదర్శన్, పలువురు అధికారులు నల్ల చెరువు సందర్శించిన వారిలో ఉన్నారు.

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- దక్షిణ డిస్కం పరిధిలో 11,129 మెగావాట్లు
- రబి, గృహ–వాణిజ్య వినియోగం పెరుగుదలతో రికార్డు స్థాయి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 6: రబి పంటల సీజన్‌లో వ్యవసాయ అవసరాలకు తోడు ఎండల తీవ్రత పెరగడంతో గృహ, వాణిజ్య మరియు పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుకుంటోంది. ఈ నెల 3న రాష్ట్రంలో మొత్తం విద్యుత్ డిమాండ్ 18,139 మెగావాట్లు గా నమోదైంది. తాజాగా శుక్రవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 11,129 మెగావాట్లు గా రికార్డు అయింది. గత సంవత్సరం ఇదే రోజున గరిష్ట డిమాండ్ 10,310 మెగావాట్లు మాత్రమే ఉండటం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఈ నెల 3న అక్కడ 4,421 మెగావాట్ల రికార్డు స్థాయి డిమాండ్ నమోదైంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో గత ఏడాది నమోదైన ఆల్‌టైమ్ రికార్డులు ఈసారి మార్చి మొదటి వారంలోనే అధిగమించడం విశేషం. వ్యవసాయ వినియోగం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో కూడా విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ రోజు గరిష్ట డిమాండ్ 2,459 మెగావాట్లు, మహబూబ్‌నగర్ జిల్లాలో 2,326 మెగావాట్లు, మెదక్ జిల్లాలో 2,181 మెగావాట్లు గా నమోదయ్యాయి. రికార్డు స్థాయిలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ తెలిపారు. పెరుగుతున్న లోడును దృష్టిలో ఉంచుకుని 33 కేవీ/11 కేవీ ఫీడర్లు మరియు సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్‌ను నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే క్షేత్రస్థాయి అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 6: తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సీనియర్ నాయకురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఎర్రబెల్లి స్వర్ణకు వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆమె వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పనిచేశారు. 2002లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికైన ఆమె, నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్ గా సేవలందించి నగరాభివృద్ధిలో తనదైన ముద్రవేశారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత ఉండటం వల్ల అధిష్ఠానం ఆమెపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలుస్తోంది. ఎర్రబెల్లి స్వర్ణ నియామకం పట్ల జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీహెచ్‌తో భేటీ అయిన వేం నరేందర్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 6: కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావుతో కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ నుంచి రాజ్యసభ స్థానం కోసం వీహెచ్ తీవ్రంగా ప్రయత్నించగా, కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం చివరికి వేం నరేందర్‌రెడ్డిని రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో వీహెచ్ ఇంటికి ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డిని వీహెచ్ శాలువాతో సత్కరించారు. అనంతరం వారిద్దరూ దాదాపు 2 గంటలపాటు ఏకాంతంగా చర్చలు జరిపారు. తనకు ఎంపీ సీటు ఇవ్వకపోవడంపై వీహెచ్ అలకబూనినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన్ని వేం నరేందర్‌రెడ్డి బుజ్జగించినట్లు సమాచారం.

సివిల్స్ లో మెరిసిన తెలంగాణ అభ్యర్థులు

- సత్తా చాటిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం లబ్ధిదారులు
- సింగరేణి ఉద్యోగి కుమార్తె సృజనకు ఆల్ ఇండియా స్థాయిలో 55 ర్యాంకు
- విజేతలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అభినందనలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 6: ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ తుది ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా సివిల్ సర్వీసెస్ లో తెలంగాణ యువత రాణించాలన్న లక్ష్యంతో సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ఆర్థిక చేయూత అందుకున్న 20 మంది అభ్యర్థులు తుది ఫలితాల్లో విజేతలుగా నిలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ యువత ఆకాంక్షలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందన్నారు. సింగరేణి ఉద్యోగి జి. రాజేశం కుమార్తె సృజన జాతీయ స్థాయిలో 55వ ర్యాంకు సాధించడంపై సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. సివిల్స్ విజేతలకు అభినందనలు తెలిపారు. గత ఏడాది ప్రారంభించిన పథకంలో తొలుత 140 మంది ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధించిన వారికి సాయం అందించగా.. వారిలో 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వారిలో ఏడుగురు విజేతలుగా నిలిచారు.

అభినందించిన సీఎం రేవంత్

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన 202 మంది అభ్యర్థులకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 51 మంది ఇంటర్వ్యూకు సెలెక్ట్ అయ్యారు. వీరిలో 20 మంది సివిల్స్ తుది ఫలితాల్లో మంచి ర్యాంకులతో విజేతలుగా నిలిచారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై విస్తృతస్థాయి సమావేశం

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 6 : ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సంకల్పంతో రాష్ట్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 06 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు చేపట్టే కార్యక్రమం పై మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో , పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో శుక్రవారం విస్తృత సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు గ్రామాల్లో కొనసాగించాలని తహసీల్దార్ గౌతమ్ కుమార్ సూచించారు. ఈ కార్యచరణపై దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తయ్యాలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిలను ఆదేశించారు. ఎంపిడిఒ సంధ్య, అధికారులు పాల్గొన్నారు.

ఎత్తయిన కొండల్లో... అసోం తెగ ప్రజలతో

- అస్సోంలో పర్యటించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- హఫ్లాంగ్, సంప్రదీసా గ్రామాల్లోని అభివృద్ధి పనుల పరిశీలన
- నేడు అసోం రైఫిల్స్ ప్రమాణోత్సవ కార్యక్రమంలో ప్రసంగించనున్న సంజయ్

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, హసావో, మార్చి6 : ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 6: ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రెండో రోజైన శుక్రవారం అసోం రాష్ట్రంలోనే ఎత్తైన కొండ ప్రాంతమైన దిమా హసావో జిల్లాలోని హఫ్లాంగ్ ప్రాంతంలో పర్యటించారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కు చెందిన మిగ్ 17 చాపర్ లో గౌహతి నుండి బయలు దేరిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తొలుత హఫ్లాంగ్ కు చేరుకున్నారు. అక్కడ అటానమస్ కౌన్సిల్ సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు, సివిల్ సొసైటీ నాయకులతో సమావేశమయ్యారు. విద్య, వైద్యం, రోడ్లు, లా అండ్ ఆర్డర్, మౌలిక సదుపాయాల కల్పన విషయంలో వారి నుండి సలహాలు సూచనలు తీసుకున్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. తొలుత పీఎంశ్రీ నిధులతో నడుస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. పీఎం శ్రీ నిధులతో చేపట్టిన కార్యక్రమాలను, అభివృద్ధి పనులను పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, మిడ్ డే మీల్స్ సెక్షన్, కిచెన్ గార్డెన్, స్మార్ట్ రూంలను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ఇంటరాక్షన్ అయ్యారు. స్కూల్లో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి స్టేడియంకు వెళ్లారు. దాదాపు రూ.16.5 కోట్లతో చేపట్టిన స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సివిల్ ఆసుపత్రికి వెళ్లి రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అక్కడున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాను సైతం కంటి పరీక్ష చేయించుకున్నారు. అనంతరం హఫ్లాంగ్ నుండి నేరుగా రోడ్డు ప్రయాణంలో అత్యంత ఎత్తైన కొండపైనున్న సమ్‌ప్రదీసా అనే మారుమూల గ్రామానికి బయలు దేరారు. కేంద్ర నిధులతో ఆ గ్రామంలో చేపట్టిన అంగన్ వాడీ సెంటర్, స్కూల్, హెల్త్ సబ్ సెంటర్, జల్ జీవన్ మిషన్, పీఎం ఆవాస్ యోజన పథకంతో నిర్మించిన ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సరిగా లేదనే విషయాన్ని గ్రహించిన కేంద్ర మంత్రి రోడ్డు నిర్మాణం పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. కొండ ప్రాంతమైన వర్షమొచ్చినా ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇంటర్ లాకింగ్ బ్లాక్ పేవ్మెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. నిర్ణీత వ్యవధిలోనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం అంగన్ వాడీ సెంటర్ కు వెళ్లి పిల్లలను, వారి తల్లిదండ్రులను కలిశారు. అక్కడ అందిస్తున్న పోషకాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి తెగకు చెందిన ప్రజలతో కొద్దిసేపు సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అసోం రైఫిల్స్ సెంటర్ అండ్ స్కూల్ కు వెళ్లారు.

నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు.
- మిగిలిన గ్రామాల్లో దాతల సహకారంతో త్వరలో ఏర్పాటు.
- మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి.

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 6: నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని సీఐ పవన్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల భద్రతను బలోపేతం చేయడానికి మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. సీపీ ఫ్యూచర్ సిటీ, డీసీపీ చేవెళ్ల జోన్ ఆదేశాల మేరకు మొయినాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో వివిధ గ్రామాలు, దేవాలయాలు, చర్చిలు మరియు ప్రధాన ప్రదేశాల్లో కెమెరాలను అమర్చారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 ఏఎన్‌పీఆర్ (ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలు మరియు 30 సీపీ ప్లస్ కెమెరాలు కీలక ప్రాంతాల్లో, అదేవిధంగా, మొయినాబాద్ మండలంలోని వివిధ దేవాలయాల ఆవరణల్లో 50 సోలార్ కెమెరాలు ఏర్పాటు. కనకమామిడి, సురంగల్, బాకారం, నాగిరెడ్డిగూడ, మేడిపల్లి, తొల్కట్ట, పెద్దమంగళారం, శ్రీరామ్ నగర్, అప్పారెడ్డిగూడ, చిల్కూరు గ్రామాల్లో దాతల సహకారంతో గుళ్లు, చర్చిలు, మసీదుల్లో 60 సోలార్/సీసీ కెమెరాలు అమర్చారు. రెడ్డిపల్లి గ్రామంలో 20, చందా నగర్ చౌరస్తాలో 4, ఎంకేపల్లి గ్రామంలో 22, ఎత్బర్‌పల్లి గ్రామంలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 200 కమ్యూనిటీ కెమెరాలు, నిర్భయ ప్రాజెక్ట్ కింద 29 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. ఈ కెమెరాల సహకారంతో అనేక కేసులను ఛేదించడం, నేరాలను అరికట్టడం కొనసాగుతున్నట్లు సీఐ పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. మొయినాబాద్ మండలంలోని మిగిలిన గ్రామాల్లో కూడా దాతల సహకారంతో త్వరలో మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీని ఓడించాలనే కుట్రతోనే బీజేపీ, ఈసీ కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టాయి. ఇదొక సైలెంట్ రిగ్గింగ్. బతికి ఉన్న ఓటర్లనూ చనిపోయినట్లుగా ప్రకటించారు. వారందరినీ ఈసీ ముందు నిలబెడతా. లక్షల మంది అర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు.

- బెంగాల్ సీఎం మమత

ఓపెన్ వాయిస్

యుద్ధం కూడా ఎన్నికల అస్త్రమే!

ఇరాన్ అణు కార్యకలాపాలు ఆపడం లేదని అమెరికా మిడిల్ ఈస్ట్‌లో అగ్ని పుట్టించింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులు చేస్తోంది. తొలిరోజు దాడిలోనే సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణించాడు. దీంతో ఇరాన్ కూడా ప్రతిదాడులు తీవ్రతరం చేసింది. అమెరికాకు అండగా నిలిచిన సున్నీ జనాభా అధికంగా ఉండే గల్ఫ్ దేశాలపై వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయాన్ని అటాక్ చేసింది. ఇక సౌదీ అరేబియాలోని ఆరామ్‌కో రిఫైనరీపై దాడిచేసింది. దీంతో ఆయిల్ ఉత్పత్తి, శుద్ధి నిలిచిపోయాయి. మరోవైపు ఆర్మ్యాజ్ జలసంధి మూసివేసింది. ఈ క్రమంలో కేంద్రం గల్ఫ్ దేశాల్లోని భారతీయలను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే చాలా మందిని స్వదేశానికి రప్పించింది. యుద్ధం నేపథ్యంలో దేశంలో ఆయిల్ సంక్షోభం తలెత్తకుండా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ తరుణంలో దేశంలోని విపక్ష పార్టీలు మోదీ టార్గెట్ గా కేంద్రంపై విమర్శలు చేస్తున్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని అమెరికా చంపేసిందని దీనిని ప్రధాని మోదీ ఖండించాలని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ డిమాండ్ చేశారు. ఒక దేశా అధినేతను చంపితే మోదీ అమెరికాకు లొంగిపోయి మౌనం పాటిస్తున్నాడని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇజ్రాయెల్, అమెరికా యుద్ధాన్ని ఖండించాలని డిమాండ్ చేశారు. ఖమేనీ హత్య తర్వాత ప్రపంచ వ్యాప్తంగా షియాలు నిరసన తెలిపారు. భారత దేశంలోని జమ్మూ కశ్మీర్‌లో, మిగతా కొన్ని ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు తీశారు. జమ్మూ కశ్మీర్‌లో ర్యాలీ ఉద్రికతతకు దారితీసింది. అయితే విపక్షాలు ఈ ర్యాలీలకు మద్దతు తెలిపాయి. అయితే విపక్షాలు గమనించాల్సింది ఏమిటంటే.. ఈ యుద్ధం మొదట ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య మొదలైంది. కానీ, తర్వాత ఇరాన్ సున్నీలను టార్గెట్ చేస్తూ గల్ఫ్ దేశాలపై దాడులు చేయడంతో ఇప్పుడు సున్నీలు, షియాల మధ్య యుద్ధంగా మారింది. మన దేశంలో ముస్లిం జనాభాలో 85 శాతం సున్నీలే. షియాలతోపాటు మిగతా చిన్నచిన్నచిన్న ఇస్లామిక్ మతాలు కలిపి 15 శాతం ఉన్నాయి. షియాలకు మద్దతు తెలుపుతున్న దేశంలోని విపక్ష పార్టీలు. 85 శాతం ఉన్న సున్నీలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నామన్న విషయాన్ని విస్మరిస్తున్నాయి.దేశంలోని కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అస్సాంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. బెంగాల్, అస్సాం, కేరళ రాష్ట్రాల్లో ముస్లిం జనాభా ఎక్కువ. ఇందులోనూ సున్నీలే 90 శాతం విపక్షాలు షియాలకు మద్దతుగా నిలవడం ద్వారా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సున్నీల ఓట్లు కోల్పోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మోదీ వ్యతిరేక ముస్లింలు మాత్రమే విపక్షాలకు మద్దతు తెలుపుతారని, షియా వ్యతిరేక సున్నీలు మద్దతు ఇచ్చే అవకాశం ఉండదని పేర్కొంటున్నారు. ఇరాన్ అణు కార్యక్రమాలు నిర్వహిస్తోందని, శాంతియుతంగా చర్చలు జరిపినా మారడం లేదని అగ్రరాజ్యం అమెరికా యుద్ధం ప్రకటించింది. ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధం చేస్తోంది. తొలి రోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని చంపేసింది. దీంతో ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. యూఏఈ, ఖతార్, బహ్రెయిన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌లు, రాయబార కార్యాలయాలు, ఆర్థిక మూలాలు లక్ష్యంగా వైమానిక దాడులు చేస్తోంది. ఇజ్రాయెల్‌పైనా యుద్ధం కొనసాగిస్తోంది. ఒమాన్ మినహా ఏడు ముస్లిం దేశాలు అమెరికా అనుకూలంగా ఉండటంతో యుద్ధం సుదీర్ఘంగా సాగే అవకాశం కనిపిస్తోంది. 'ఖమేనీ హత్య పరిణామాలు తీవ్రంగా ఉంటాయి, శత్రువులు ఏడ్వాల్సిందే' అని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్-4' పేరుతో పశ్చిమాసియాలో 27 అమెరికా స్థావరాలపై, యూఏఈలో జబెల్ అలీ పోర్టు, అబుదాబి విమానాశ్రయం, బుర్జ్ ఖలీఫాపై క్షిపణులు ప్రయోగించారు. బహ్రెయిన్, కువైట్ లో సైరన్లు మోగిపోయాయి. ఇదిలా ఉంటే ఈ యుద్ధం నుంచి భారత్ కూడా చాలా విషయాలు తెలుసుకోవాలి. ముస్లిం ఐక్యతకు ఈ యుద్ధం తీవ్ర దెబ్బ తీసింది.మొత్తంగా భారత దేశంలో విపక్షాల తీరు చూస్తుంటే.. యుద్ధం సాకుతో ఓటు బ్యాంకు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. అలా కాకుండా దేశం కోసం, అదే సమయంలో తమకు అనుకూలంగా ఉండే అంశాలపై మాట్లాడితే కొంత లబ్ధి కలుగుతుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
07.03.2026

ఎర్ర జెండా నీడలో నలభై ఏళ్ల పోరాటం

గణపతి జీవితం విరుద్ధాల సమాహారం. ఒకవైపు సిద్ధాంతవేత్తగా రచనలు చేసిన వ్యక్తి; మరోవైపు హింసాత్మక పోరాటాలకు నాయకత్వం వహించిన వ్యక్తి. ఒకవైపు గిరిజన హక్కుల పరిరక్షణ నినాదాలు; మరోవైపు నిరపరాధుల ప్రాణనష్టం. ఈ విరుద్ధాలను అర్థం చేసుకోకుండా ఆయన ఉద్యమ రీతిని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

భారతదేశ రాజకీయ చరిత్రలో సాయుధ ఉద్యమం ఒక విభిన్న అధ్యాయంగా నిలిచింది. ఆ అధ్యాయానికి ప్రతీకగా మారిన పేరు ముప్పాళ లక్ష్మణ్ రావు, "గణపతి"గా ప్రసిద్ధి పొందిన వ్యక్తి. ఇటీవల వెలువడుతున్న లొంగుబాటు వార్తల నేపథ్యంలో ఆయన జీవితం, ఉద్యమ ప్రయాణం, దేశ రాజకీయ-సామాజిక పరిణామాలపై వాటి ప్రభావం మళ్లీ చర్చకు వచ్చింది. ఒక వ్యక్తి నిర్ణయం వెనుక దాగి ఉన్న దశాబ్దాల చరిత్రను, పూర్వాపరాలను, గణాంకాలను సమగ్రంగా పరిశీలించడం అవసరం.

1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి

గ్రామంలో రైతుల తిరుగుబాటు భారత రాజకీయ దిశను ప్రభావితం చేసింది. భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా ప్రారంభమైన ఆ ఉద్యమం "నక్సల్బరి" పేరుతో దేశ వ్యాప్తంగా విస్తరించింది. విద్యార్థి యువత, సామాజిక అసమానతలపై ఆవేదన కలిగిన వర్గాలు ఈ సిద్ధాంతానికి ఆకర్షితులయ్యాయి. గ్రామీణ భారతంలో భూమి పంపిణీ, కూలీల హక్కులు, గిరిజనుల జీవనాధారాల పరిరక్షణ వంటి అంశాలు ఆ ఉద్యమానికి మూల సూత్రాలుగా నిలిచాయి. ఆ ప్రభావంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత జగిత్యాల జిల్లా లోని మండల కేంద్రం అయిన బీర్‌పూర్ గ్రామానికి చెందిన ముప్పాళ లక్ష్మణ్ రావు యువకుడిగా వామపక్ష భావజాలం వైపు మళ్లాడు. 1970లలో ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించిన సాయుధ గుంపుల్లో చేరి, తరువాత పీపుల్స్ వార్ గ్రూప్ లో ప్రముఖ పాత్ర పోషించాడు. కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలో ఏర్పడిన ఈ సంస్థ తెలంగాణ-ఆంధ్ర అటవీ ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధ వ్యూహాలతో కార్యకలాపాలు సాగించింది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ నిర్మాణం, గిరిజన యువతను ఆకర్షించడం, భూస్వామ్య వ్యతిరేక ప్రచారం వంటి కార్యక్రమాల్లో గణపతి సక్రియంగా పాల్గొన్నాడు.

2004లో పీపుల్స్ వార్ గ్రూప్ మరియు మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్

విలీనమై కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) గా మారడం ఎడమచేయి అతివాద చరిత్రలో కీలక మలుపు. ఈ విలీనంతో దేశవ్యాప్తంగా ఉన్న విభిన్న గుంపులు ఒకే కేంద్రీయ నాయకత్వం కిందకి వచ్చాయి. ఆ సమయంలో గణపతి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి ఉద్యమానికి వ్యూహాత్మక దిశనిచ్చాడు. దండకారణ్య అటవీ ప్రాంతం కార్యకలాపాల కేంద్రంగా మారింది. 2004-2014 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. అధికార గణాంకాల ప్రకారం ఈ దశాబ్దంలో సుమారు 14,800కు పైగా హింసాత్మక ఘటనలు నమోదయ్యాయి; 6,000కు పైగా ప్రాణనష్టం సంభవించింది. భద్రతా దళాలు, మావోయిస్టులు, సాధారణ పౌరులు—మూడు వర్గాలూ ఈ ఘర్షణల్లో బలయ్యారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో దాడులు తీవ్రరూపం దాల్చాయి. 2009లో కేంద్ర ప్రభుత్వం "ఆపరేషన్ గ్రీన్ హంట్" పేరుతో విస్తృత భద్రతా చర్యలు ప్రారంభించింది. అటవీ ప్రాంతాల్లో సైనిక శక్తిని పెంచడం, ప్రత్యేక బలగాలను నియమించడం, ఇంటె

లిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంది. ఈ చర్యల ఫలితంగా 2014 తరువాత హింసాత్మక ఘటనలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. 2014-2024 మధ్యకాలంలో ఘటనలు సుమారు 7,100కు తగ్గి, మరణాల సంఖ్య 1,800కు చేరినట్లు కేంద్ర సమాచారం సూచిస్తుంది. ఒకప్పుడు 126 జిల్లాలను ప్రభావితం చేసిన ఎడమచేయి అతివాదం ప్రస్తుతం సుమారు 10-12 జిల్లాలకు మాత్రమే పరిమితమైందని అధికార నివేదికలు చెబుతున్నాయి. 2024లో సుమారు 475 మంది మావోయిస్టులు లొంగిపోగా, 2025లో ఈ సంఖ్య వెయ్యి దాటిందని భద్రతా వర్గాలు ప్రకటించాయి.

ఇదే కాలంలో భద్రతా దళాల చర్యల్లో వందలాది మావోయిస్టు కాడర్లు మరణించినట్లు కూడా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామాల్లో గణపతి వ్యక్తిగత పరిస్థితులు కూడా కీలకమయ్యాయి. ఆరోగ్య సమస్యలు, వయోభారం కారణంగా 2018 ప్రాంతంలో ఆయన ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి తప్పుకోవడం జరిగింది. నాయకత్వ మార్పులు, అంతర్గత విభేదాలు, సాంకేతిక నిఘా వ్యవస్థల పెరుగుదల... ఇవి ఉద్యమ సామర్థ్యాన్ని దెబ్బతీశాయి. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యా సదుపాయాలు, మొబైల్ కనెక్టివిటీ విస్తరించడం వల్ల భూగర్భ కార్యకలాపాలు కష్టతర మయ్యాయి. ఇటీవల వెలువడుతున్న లొంగుబాటు వార్తలు ఈ క్రమంలో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గణపతి స్వచ్ఛందంగా లొంగుతారా? లేక ఇప్పటికే గోప్యంగా చర్చలు జరిగాయా? అన్నది స్పష్టత పొందాల్సి ఉంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం...ఒక దశాబ్దాలపాటు అత్యంత వాంఛనీయుడిగా ప్రకటించ బడిన నాయకుడు లొంగితే, అది ఉద్యమ చరిత్రలో సంకేతాత్మక మలుపు అవుతుంది. ఇది కేవలం ఒక వ్యక్తి మార్పు కాదు; ఒక సిద్ధాంత-సాయుధ ప్రయాణానికి సంబంధించిన చారిత్రక దశ. అయితే దీనిని పూర్తిస్థాయి ముగింపుగా చూడటం సరికాదు. ఎందుకంటే సామాజిక అసమానతలు, భూహక్కుల సమస్యలు, గిరిజనుల జీవనోపాధి సంక్షోభం వంటి మూల కారణాలు ఇంకా పూర్తిగా పరిష్కరించ బడలేదు. కేవలం భద్రతా చర్యలతో ఉద్యమం తగ్గినా, శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర అభివృద్ధి విధానాలు, పారదర్శక పాలన, స్థానిక ప్రజల భాగస్వామ్యం అవసరం. గణపతి జీవితం విరుద్ధాల సమాహారం. ఒకవైపు సిద్ధాంతవేత్తగా రచనలు చేసిన వ్యక్తి; మరోవైపు హింసాత్మక పోరాటాలకు నాయకత్వం వహించిన వ్యక్తి. ఒకవైపు గిరిజన హక్కుల పరిరక్షణ నినాదాలు; మరోవైపు నిరపరాధుల ప్రాణనష్టం. ఈ విరుద్ధాలను అర్థం చేసుకోకుండా ఆయన ఉద్యమ రీతిని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. లొంగుబాటు జరిగితే చట్టపరమైన ప్రక్రియలు, విచారణలు, బాధితులకు న్యాయం వంటి అంశాలు ముందుకు వస్తాయి. అదే సమయంలో ఆయన అనుభవాలు ఉద్యమ అంతర్గత గమనాన్ని వెలుగులోకి తెచ్చే అవకాశమూ ఉంటుంది. చరిత్రలో అనేక సాయుధ ఉద్యమాలు కాలక్రమేణా రాజకీయ ప్రధాన ప్రవాహంలో కలిసి పోయాయి. కొన్ని క్షీణించాయి. గణపతి పరిణామం కూడా ఆ దిశగా ఒక సూచన కావచ్చు. మొత్తంగా చూస్తే, ముప్పాళ లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి ప్రయాణం భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఒక సవాలు, ఒక పాఠం. సాయుధ మార్గం, ప్రజాస్వామ్య మార్గం మధ్య ఉన్న విభేదం, అభివృద్ధి-భద్రతా సమతుల్యత, సామాజిక న్యాయం సాధన... ఇవి గణపతి ప్రయాణంలో అంతర్లీనంగా ఉన్నాయి. లొంగుబాటు సందర్భం దేశానికి ఒక ఆత్మపరిశీలన క్షణం. సమగ్ర అభివృద్ధి, న్యాయ సమ్మత పాలన, ప్రజల విశ్వాసం.. ఈ మూడు స్తంభాలపై దృష్టి కేంద్రీకరించినప్పుడే ఇలాంటి ఉద్యమాల అవసరం శాశ్వతంగా తగ్గుతుంది. గణపతి ఉద్యమ జీవితం ఆ దిశగా ఒక చరిత్ర బోధ.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

సంకల్పంతో శిఖరాగ్రానికి చేరిన మాతృమూర్తి

కొండేటి ప్రకాష్
7981781086

అపూర్వమైన అమ్మ ప్రేమకు నిర్వచనం ఆమె జీవితం అయితే.. అచంచల సంకల్పానికి నిలువుటద్దం ఆమె ప్రస్థానం. సమాజంలో స్త్రీలకు ఎదురవుతున్న అనేక సవాళ్లను అధిగమించి, విజయ తీరాలకు చేరడమే కాకుండా.. ఎంతో మంది మహిళలకు ఆదర్శ వంతురాలిగా మిధాని సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ మధుబాల కల్లూరి నిలిచారని చెప్పవచ్చు."

స్ఫూర్తినిచ్చే నేపథ్యం

విజయవాడలో ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన మధుబాల ఎదుగుదల వెనుక అచంచలమైన కృషి ఉంది. తండ్రి అన్నే వెంకట్రావు ప్రభుత్వ అధికారిగా ఉంటూ, అప్పట్లో ఉన్న సామాజిక కట్టుబాట్లను పక్కన పెట్టి తన ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువుల వైపు నడిపించారు. ఒక అక్క ఇస్రోలో సైంటిస్ట్‌గా, మరో అక్క ఎంపీడీఓగా రాణించడం మధుబాలలో చిన్ననాడే పట్టుదలను పెంచింది. అప్పట్లో విజయవాడ నుంచి మచిలీపట్టణానికి ఒంటరిగా ప్రయాణిస్తూ చదువుకోవడమే ఆమెలోని ధైర్యానికి పునాది వేసింది.

మూడు దశాబ్దాల అంకితభావం

మధుబాల విద్యా ప్రస్థానం ఆసక్తికరమైన మలుపులు తిరిగింది. నిజానికి ఆమె సైన్స్ చదవాలనుకున్నా, పరిస్థితులు ఆమెను కామర్స్ వైపు మళ్లించాయి. డిగ్రీ తర్వాత సీఏ చేయాలన్న ఆలోచన ఉన్నా, అప్పటి పరిస్థితుల్లో త్వరగా ఉద్యోగంలో స్థిరపడాలన్న గురువు సలహాతో ఐసీడబ్ల్యుఏఐ (ICWAI) పూర్తి చేశారు. 1993లో మిధానిలో ఒక సాధారణ అకౌంట్స్ ఆఫీసర్‌గా ప్రస్థానాన్ని మొదలుపెట్టి, 32 ఏళ్ల పాటు నిరంతర శ్రమతో నేడు అదే సంస్థకు డైరెక్టర్ స్థాయికి చేరారు. కాస్టింగ్, ఆడిట్, ట్యాక్సేషన్ వంటి ప్రతి విభాగంపై ఆమె సాధించిన పట్టు, ఎనిమిది మంది దిగ్గజ నిపుణులతో పోటీ పడి నెగ్గడానికి కారణమైంది.

సేవా పథంలో అదనపు బాధ్యతలు

కేవలం ఫైనాన్స్ రికార్డులకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతలోనూ మధుబాల ముందున్నారు. మిధాని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ చైర్మన్‌గా కేవలం 10 రూపాయలకే పేదలకు కార్పొరేట్ స్థాయి చికిత్స అందేలా చూడటం ఆమెలోని సేవాగుణానికి నిదర్శనం.

అలాగే 2,100 మంది విద్యార్థులు ఉన్న ప్రాజెక్ట్ స్కూల్ నిర్వహణ బాధ్యతలను కూడా ఆమె ఆనందంగా నిర్వహిస్తున్నారు. మిధాని సంస్థలో మహిళా ఉద్యోగుల సంఖ్య పెరగడంలోనూ, వారు క్లిష్టమైన ఫర్నేస్ విభాగాల్లో కూడా పనిచేసేలా ప్రోత్సహించడంలో ఆమె పాత్ర ఎంతో ఉంది.

ఉద్యోగులకు ఆమె ఒక భరోసా

మిధాని సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రోజు నుండి, సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా మధుబాల ఫైనాన్స్ విభాగంలో అనేక కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. గత 32 ఏళ్లుగా సంస్థలోని వివిధ హోదాల్లో సేవలందించిన ఆమెకు, కింది స్థాయి ఉద్యోగుల మరియు వారి కుటుంబాల స్థితిగతులపై పూర్తి అవగాహన ఉంది. ముఖ్యంగా తాత్కాలిక ఉద్యోగుల పట్ల ఆమె మానవీయ కోణంలో ఆలోచిస్తున్నారు. వారికి సరైన సమయానికి జీతభత్యాలు అందేలా చూడటం, పీఎఫ్ (PF) సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం వంటి చర్యల ద్వారా వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. తన విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు, ఉద్యోగుల పట్ల తల్లి వంటి ఆదరణను కనబరుస్తూ ఆమె అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

మహిళా లోకానికి సందేశం

మహిళ అని కాకుండా, మన పనితీరే మన గుర్తింపుగా ఉండాలని మధుబాల నమ్ముతారు. నేటి తరం మహిళలు ఇల్లు, ఆఫీసును బ్యాలెన్స్ చేసుకునే క్రమంలో సమయపాలన పాటించాలని ఆమె సూచిస్తారు. చదువు పూర్తయ్యాక కూడా సబ్జెక్టుపై పట్టు కోల్పోకుండా నిరంతరం అప్‌డేట్ అవ్వడం అత్యవసరమని ఆమె అంటారు. తన ఎదుగుదలకు భర్త రవికిశోర్, అత్తమామల సహకారం మరువలేనిదని చెబుతూ, ప్రతి మహిళా విజయం వెనుక ఒక బలమైన కుటుంబం ఉంటుందని ఆమె నమ్ముతారు. అత్యున్నత స్థాయి బాధ్యతల్లో ఉంటూ కూడా మొక్కల పెంపకం వంటి చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని వెతుక్కునే మధుబాల కల్లూరి ప్రయాణం నిజంగా అద్భుతం. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె సాధించిన విజయాలు మరో పదిమందికి స్ఫూర్తినిస్తాయనడంలో సందేహం లేదు.

(మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

తప్పు ఎవరిది? శాపం ఎవరికి?

జి. అజయ్ కుమార్

అభివృద్ధి అంటే ఏమిటి? నగరాల సుందరీకరణా? లేక ప్రజల కన్నీళ్లపై నిర్మించే సౌధాలా? ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న వరుస కూల్చివేతలు ఈ ప్రశ్నలను ప్రజల గొంతులోంచి వినిపిస్తున్నాయి. మూసీ పునరుద్ధరణ, చెరువుల సంరక్షణ, ఎఫ్‌టీఎల్ , పరిధుల గుర్తింపు, బఫర్ జోన్ల పరిరక్షణ... ఇవన్నీ వినడానికి మంచివైన లక్ష్యాలే కావచ్చు. కానీ వాటి అమలులో కనిపిస్తున్న తీరు మాత్రం సామాన్యుడిని తీవ్ర అభద్రతాభావంలోకి నెట్టేస్తోంది. అక్రమ నిర్మాణాలను తొలగించడం తప్పు కాదు. చట్టాన్ని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యతే. కానీ ఆ చట్టాన్ని అమలు చేసే విధానం ప్రశ్నార్థకంగా మారితే, అభివృద్ధి అనే మాటే ప్రజలకు భయపెట్టే పదంగా మారుతుంది. దశాబ్దాలుగా మౌనం వహించిన అధికార యంత్రాంగం, ఇప్పుడు ఒక్కసారిగా బుల్డోజర్లతో రంగంలోకి దిగడం వెనుక ఉన్న అసలు కారణం ఏమిటి అన్న ప్రశ్న ఇప్పుడు ప్రజల ముందుంది.

వ్యవస్థ చేసిన తప్పుకు... సామాన్యుడికి శిక్షా?

ఒక ఇల్లు ఒక్క రోజులో పుట్టదు. అది ఒక కుటుంబం జీవితకాల పొదుపు, అప్పుల భారంతో కూడిన ప్రయాణం, ఎన్నో కలల సమాహారం. కానీ ఒక ఉదయం బుల్డోజర్ వచ్చి ఆ గోడలను కూల్చేసినప్పుడు కేవలం ఇటుకలు, సిమెంట్ మాత్రమే కాదు... ఒక కుటుంబం భద్రతా భావం, భవిష్యత్తు కూడా శిధిలమవుతుంది. లే అవుట్లు ఆమోదించినప్పుడు, రిజిస్ట్రేషన్లు జరిగినప్పుడు, విద్యుత్ మరియు నీటి కనెక్షన్లు ఇచ్చినప్పుడు ఎక్కడికి పోయాయి ఈ నిబంధనలు? నిర్మాణ సమయంలో చూసీచూడనట్లు వ్యవహరించిన అధికారులు ఇప్పుడు అకస్మాత్తుగా చట్టం పేరు చెప్పడం ఎంతవరకు న్యాయం?

వెలుగుమట్ల భూదాన్ భూములు – నమ్మకం కూలిపోయిన వైనం

ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలో జరిగిన కూల్చివేతలు ఈ సమస్యకు ఒక స్పష్టమైన ఉదాహరణగా నిలిచాయి. దశాబ్దాలుగా భూదాన్ భూముల్లో నివసిస్తున్న కుటుంబాలకు అకస్మాత్తుగా "ఇది మీది కాదు" అని చెప్పి, వందలాది పోలీసులతో బుల్డోజర్లు దింపడం అక్కడి ప్రజలను దిక్కుతోచని పరిస్థితిలోకి నెట్టేసింది. ప్రభుత్వాన్ని నమ్మి దశాబ్దాలుగా అక్కడ జీవిస్తున్న కుటుంబాలకు కనీసం పునరావాసం కల్పించకుండా ఇళ్లను కూల్చివేయడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు వ్యవస్థే అనుమతించిన నివాసాలు, ఇప్పుడు అక్రమాలుగా ఎలా మారాయి? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది కూడా అదే వ్యవస్థ.

'సుందరీకరణ' ముసుగులో జీవితాలు ఛిద్రం

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో మూసీ నదిని శుద్ధి చేయడం అవసరమే. చెరువులను కాపాడటం కూడా అవసరమే. కానీ ఈ ప్రక్రియలో నది ఒడ్డున దశాబ్దాలుగా నివసిస్తున్న కుటుంబాల జీవితాలను పూర్తిగా విస్మరించడం సరైన దృక్పథమా? అభివృద్ధి పేరుతో నివాసాలను కూల్చివేస్తున్నప్పుడు వారికి ప్రత్యామ్నాయ గృహాలు ఎక్కడ? జీవనాధారాలు కోల్పోయిన కుటుంబాల బాధను ఎవరు పంచుకుంటారు? మనుషుల కన్నా నగర సుందరీకరణే ముఖ్యమా? అనే ప్రశ్న ఇప్పుడు సమాజం ముందుంది.

ప్రభుత్వానికి ఆత్మపరిశీలన అవసరం

కేవలం గోడలను కూల్చడం అభివృద్ధి కాదు. ప్రజల నమ్మకాన్ని కాపాడటమే నిజమైన అభివృద్ధి. అందుకే ప్రభుత్వం ఈ విషయంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శ్వేతపత్రం విడుదల చేయాలి: ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు, ప్రభుత్వ భూములు, భూదాన్ భూములపై స్పష్టమైన మరియు పారదర్శకమైన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి.

అభివృద్ధి కావాలి. నగరాలు బాగుపడాలి. కానీ అది ప్రజల కన్నీళ్లపై నిర్మించబడకూడదు. వ్యవస్థ చేసిన పాపానికి సామాన్యుడు శాపం అనుభవించకూడదు. ప్రభుత్వం కళ్లు తెరవాలి, మానవీయ దృక్పథంతో సమస్యను పరిష్కరించాలి. లేకపోతే ఈ బుల్డోజర్లు ఇళ్లను మాత్రమే కాదు... ప్రజల మనసుల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని కూడా శాశ్వతంగా కూల్చివేస్తాయి.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షలు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

మక్క రైతులకు డబ్బులు విడుదల

- మూడు రోజుల్లో అకౌంట్లోకి డబ్బులు
- రూ.171 కోట్లు విడుదల
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 6: మొక్కజొన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెండు, మూడు రోజుల్లో రైతుల అకౌంట్లో నగదు జమ కానున్నాయి. మొక్కజొన్న రైతులకు చెల్లించేందుకు మార్క్‌ఫెడ్‌కు రూ.171 కోట్లు తాజాగా ప్రభుత్వం విడుదల చేసింది. అవి మార్క్‌ఫెడ్ నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో వేయనున్నారు. వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి మార్క్‌ఫెడ్ 3.77 లక్షల టన్నుల మొక్కజొన్న రైతుల నుంచి సేకరించింది. దాదాపు 78,500 మంది రైతులు వీటిని విక్రయించారు. అయితే రైతులకు చెల్లించాల్సిన సొమ్ము ఇప్పటివరకు పెండింగ్‌లో ఉండగా.. విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతోరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజుల్లో అకౌంట్లోకి..

తొలి దశలో మొక్కజొన్న రైతులకు చెల్లించేందుకు ప్రభుత్వం రూ.735.39 కోట్లు విడుదల చేసింది. అనంతరం ఇప్పుడు రూ.171 కోట్లు రిలీజ్ చేసింది. రైతులు సొమ్ము కోసం ఎప్పటినుంచో ఎదురుచూన్నారు. ఎప్పుడెప్పుడు విడుదల అవుతాయా అని చూస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో జమ కానుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్నలు విక్రయించి నాలుగు నెలలు అయినా డబ్బులు రాకపోవడంతో రైతులు నిరాశ చెందారు. యాసంగి సీజన్‌కు పెట్టుబడి పెట్టుకోవడానికి నిధుల్లేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో కొంతమంది రైతులు వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు తెచ్చుకుంటున్నారు. ఇక ఈ విద్యా సంవత్సరం చివరి దశకు చేరుకోవడంతో పిల్లల ఫీజులు చెల్లించేందుకు నగదు లేక అవస్థలు పడుతున్నారు. నెలలైనా డబ్బులు అందకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు, ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేస్తున్నారు.

జనవరి 17 నుంచి పెండింగ్..

గతంలో పంట విక్రయించిన తర్వాత వారానికి ఒకసారి రైతుల అకౌంట్లలో డబ్బులు జమ అయ్యేవి. కానీ జనవరి 17 నుంచి నిధులు జమ కావడం లేదు. దీంతో సొమ్ము రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలామంది ఎక్కువ ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా.. విక్రయించాక రూ.లక్షల్లో సొమ్ము రావాల్సి ఉంది. దీంతో ఖర్చుల కోసం డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే రెండు, మూడు రోజుల్లో డబ్బులు పడే అవకశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అటు మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతు భరోసా నిధులు జమ చేస్తామని సీఎం రేవంత్ గతంలో ప్రకటించారు. కానీ మున్సిపల్ ఎన్నికలు ముగిసి చాలా రోజులైన ఇంకా ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు జమ చేస్తారనే దానిపై ప్రభుత్వం నుంచి ఎలంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

దేగాం పీహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- ఏఎన్ఎం కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 6 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఆలూరు మండలం దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, ల్యాబ్, డిస్పెన్సరీ, ఫార్మసీ, ఇమ్యూనైజేషన్ రూమ్, తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నవైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో డ్యూటీ డాక్టర్ రక్షిత అందుబాటులో లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌండ్ ది క్లాక్ పీ.హెచ్.సీలో వైద్యులు లేకపోతే ఎలా అని సిబ్బందిని నిలదీశారు. రిజిస్టర్ లు సక్రమంగా నిర్వహించకుండా, సరైన వివరాలు అందించని ఏఎన్ఎం పద్మలత తీరును తప్పుబడుతూ, షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఎంహెచ్ఓ ను ఆదేశించారు. పేషంట్ల వివరాలతో కూడిన రిజిస్టర్ పరిశీలించి, వారికి అందించిన ఔషధాలను గమనించారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డిస్పెన్సరీలో నిలువ ఉన్న ఔషధాల గడువు తేదీ, వాటి నాణ్యతను పరిశీలించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో విధులు నిర్వహించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో.అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రతిపక్షం, జనగామ ప్రతినిధి, మార్చి 6 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై మహబూబాబాద్ ఐడీవోసీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను తీర్చాలని, అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి కొరత ఉండకుండా చూడాలని సూచించారు. ఉపయోగంలో లేని వైద్య పరికరాలను తొలగించి, అవసరమైన పరికరాలకు తగిన సిబ్బందిని నియమించి వాటిని సమర్థంగా వినియోగంలోకి తేవాలని పేర్కొన్నారు. పాఠశాలల వాహనాలు ఫిట్ నెస్ లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జీపీఆర్ఎస్ ద్వారా పాఠశాల వాహనాలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. స్లమ్ ఏరియాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ఉందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి, ఎక్కడైనా నిధులు మంజూరు సమస్య ఉంటే నివేదికలు పంపాలని తెలిపారు. ప్రతీ హాస్టల్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించి తనిఖీలు చేయాలని, విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, గ్రౌండ్ కాని ఇండ్లు లబ్ధిదారుల నుంచి అంగీకారాన్ని తీసుకుని రద్దు చేయాలని తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార స్థితిని దరఖాస్తుదారులు తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్ వేర్‌ను రూపొందించి సమాచారం వారి సెల్‌ఫోన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల వసతి గృహాల్లో ఇన్సినరేటర్లు ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో ఆరోగ్య సదస్సులు నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

10వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

ప్రతిపక్షం, జనగామ ప్రతినిధి, మార్చి 6 : జనగామ నుంచి దుద్దెడకు వెళ్తున్న జాతీయ రహదారిలో ప్లాట్లు కోల్పోతున్న బాధితుల రిలే నిరాహార దీక్షలు 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బాధితుల సంఘం తరుపున దోర్నాల శ్రీనివాస్ శుక్రవారం నాటి దీక్షకు ప్రారంభించి మాట్లాడారు. బాధితులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని, లేదంటే జనగామ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేసి ఉద్యమాన్నిమరింత బలోపేతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నల్ల యాదగిరి, పరమేశ్వరీ, మహేందర్, సిద్ధిలింగం, జగన్మోహన్, ఎస్.కె అమీన్షా, ఉప్పరి విజయ్, ఏనుగుల సునీత వీరయ్య, ఆగస్టీన్ రెడ్డి పాల్గొన్నారు.

సుజాతా మూర్తికి ఉమెన్ లీడర్‌షిప్ అవార్డు

ప్రతిపక్షం, విశాఖపట్నం, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లో హై బిజ్ టీవీ నిర్వహించిన ఉమెన్ లీడర్‌షిప్ అవార్డ్స్ కార్యక్రమంలో విశాఖపట్నానికి చెందిన వ్యాఖ్యాత్రి, రచయిత్రి, గాయని ఉండవిల్లి సుజాతా మూర్తికి అవార్డు ప్రదానం చేశారు. మీడియా రంగంలో దాదాపు పది సంవత్సరాలుగా లోకల్ టీవీ ఛానల్‌లో స్పష్టమైన ఉచ్చారణతో వార్తలను సమర్థంగా ప్రజెంట్ చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందినందుకు గాను ఈ అవార్డును ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని సుజాతా మూర్తి గారి ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంగా సుజాతా మూర్తి మాట్లాడుతూ, తనపైనమ్మకం ఉంచి ఈ గౌరవాన్ని అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మీడియా రంగంలో మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న పోలీస్ కమీషనర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 6 : నిజామాబాద్ నగరం 2టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ని జమా మసీద్‌లో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో నిజామాబాద్ పోలీస్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పాల్గొన్నారు. ముక్తి సయిద్ అక్బర్ నిర్వహించిన దువాలో సీపీ పాల్గొని, అనంతరం ఉపవాస విరమణ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రంజాన్ మాసం విశిష్టతను విశ్లేషణాత్మకంగా వివరించారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి నిజామాబాదుకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ శ్రీనివాస్ రాజ్, టౌన్ 2 ఎస్.ఐ సయ్యద్ ముజాహిద్, జనరల్ సెక్రటరీ అబ్దుల్ మన్నన్ , కార్పొరేటర్ అబ్దుల్ అందాన్ , మాజీ కార్పొరేటర్ అబ్దుల్ కుద్దుస్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ప్రగతి ప్రణాళికతో ప్రజల వద్దకే ప్రభుత్వం

- 99 రోజుల కార్యక్రమంతో సమస్యలకు పరిష్కారం
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు
- రంగారెడ్డి కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు
- స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు



ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా, మార్చి 6: రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 6 నుంచి 99 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతోపని చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులకు కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానంపై వివరించారు. ఈ సమావేశంలో తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాదకుమార్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబు,శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల పాటు చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి చేరేలా గుర్తించి, అమలు కాని అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పది కీలక అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లనున్నారని తెలిపారు. రేషన్ కార్డులు, ఇల్లు లేని నిరుపేదలకు గృహాలు కేటాయించే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించామని, అన్ని శాఖలు సమన్వయంతోపనిచేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. హౌసింగ్ పథకం కింద ఇండ్ల నిర్మాణాలకు చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకుంటామని, గ్రామ పంచాయతీల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి , మనోహర్ రెడ్డి , ప్రకాష్‌గౌడ్ , కాలే యాదయ్య , వీర్లపల్లి శంకర్ , వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి తో పాటు వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్ మరియు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- 99 రోజుల ప్రగతి ప్రణాళిక ప్రారంభం

ప్రతిపక్షం, షాద్‌నగర్, మార్చి 6: షాద్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధిని వేగవంతం చేసి, మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" పేరుతో చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యక్రమానికి శుక్రవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజల సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనుల అమలుకు ఈ కార్యక్రమం కీలకంగా మారుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులోని సమస్యలను గుర్తించి వాటిని దశలవారీగా పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు. ప్రజా అవసరాలే ప్రాధాన్యంగా తీసుకొని మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మున్సిపాలిటీ ఆదర్శంగా నిలుస్తుందని ఆయన అన్నారు. మున్సిపాలిటీ నిధులతో పాటు అవసరమైతే తన వంతు నిధులు కూడా సమకూర్చి అభివృద్ధి పనులు వేగవంతం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమానికి హాజరైన సీడీఎంఏ జి.మమత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ఈ 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి వార్డులో పారిశుద్ధ్య కార్యక్రమాలు, చెత్త నిర్వహణ, మొక్కల నాటకం, కాలువల శుభ్రత వంటి అంశాలను ప్రాధాన్యంగా చేపట్టాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, కౌన్సిలర్లు అగ్గనూరు విశాలా విశ్వం, శ్రావణి, లక్ష్మి ప్రసన్న, ఎస్పీ శివ, పినమోని గోపాల్, మురళీమోహన్ (అప్పి), పెంటయ్య, కళ్యాణ్ కార్ దిలీప్, వాణి, శిరీష, రిజ్వానా బేగం, అశోక్, మరియం బేగం, జయలక్ష్మి, నాజియా బేగం, సంతోషి భాయ్, ఆరిఫ్ బేగం, తెలుగు వసంత, అనిత, శారదా, జమ్రుద్ ఖాన్, ముబారక్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్‌తో చర్చల ప్రసక్తే లేదు. లొంగిపోవడం ఒక్కటే ఇరాన్ ముందున్న మార్గం. బేషరతుగా సరెండర్ అయితే తప్ప, ఇరాన్‌తో ఎలాంటి ఒప్పందాన్నీ కుదుర్చుకునేది లేదు. ఆ తర్వాత గొప్ప, అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడి ఎన్నిక ఉంటుంది. ఇరాన్‌కు గొప్ప భవిష్యత్ ఉంది. ఆర్థికంగా ఇరాన్‌ను మునుపటి కంటే పెద్దగా, ఉత్తమంగా, బలంగా తీర్చిదిద్దుతాం.
- అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్

ప్రాంతీయం

తారా కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ ప్రారంభోత్సవం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 6 : తార ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రవీణ తెలిపినారు.ప్రత్యేకంగా విద్యాశాఖ అభివృద్ధికై ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమములో భాగంగా 10 రోజుల అభివృద్ధి ప్రణాళిక ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, ఈ పది రోజుల్లో చేపట్టి చేపట్టవలసిన అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తామని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. మొదటి రోజైన శుక్రవారం కార్యక్రమంలో భాగంగా అధ్యాపక బృందము, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ క్యారెట్లు, విద్యార్థిని విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడం జరిగిందని, కళాశాలలో వృధాగా పేరుకుని పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందని, దీనివల్ల పర్యావరణ పరిశుభ్రత ఏర్పడి పర్యావరణంలో సమతుల్యత ఏర్పడడానికి అవకాశం ఉంటుందని తెలిపినారు .ఈ పది రోజులలో నిర్వహించవలసిన కార్యక్రమ ప్రణాళికను తయారు చేసుకోవడం జరిగిందని తెలిపినారు. ఈ పది రోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా కళాశాలలో అన్ని రకాలైన రికార్డులను తయారు చేయడము, సైన్స్ విభాగాల లేబరేటరీ సదుపాయాలను మెరుగుపరచడం, కళాశాలలో వివిధ విభాగాలలో చేయవలసిన రిపేర్లను చేయించడం జరుగుతుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందము ఎన్ఎస్ఎస్ అధికారులు ఎన్సిసి అధికారి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ట్విట్టర్లో పై అధికారులకు ఫిర్యాదు చేస్తే కానీ కదలని హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు

- పటాన్ చెరు అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీ సమస్యకు స్పందించిన ఎండీఆర్ ఫౌండేషన్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 6 : పటాన్ చెరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీ ఉప్పొంగి రోడ్డుపై ప్రవహిస్తూ ఇండ్లలోకి మురికి నీరు వస్తున్నాయంటూ స్థానికులు స్పందించకపోవడంతో ఎండీఆర్ ఫౌండేషన్ ట్విట్టర్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తే గాని స్పందించని స్థానిక హెచ్ ఎం డబ్ల్యూ ఎస్ అధికారులు. ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు స్వయంగా వెళ్లి కాలనీలో పరిశీలించారు. సమస్య తరచూ వస్తోందని స్థానికులు వారి దృష్టికి తీసుకెళ్లారు . గతంలో డ్రైనేజీ లెవెల్స్ పరిశీలించకుండా పనులు చేయడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు తెలిపారు. హెచ్ఎండబ్ల్యూఎస్ సిబ్బంది శుక్రవారం అంబేద్కర్ కాలనీలో తాత్కాలిక పనులు నిర్వహించారు.ఈ సమస్యకు తాత్కాలిక ఉపశమనం కాదని శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. సమస్యను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎండీ ఆర్ ఫౌండేషన్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణంలో సమస్యలను పరిష్కరిస్తాం

- చీపుర్లు పట్టి.. చెత్త తొలగించిన చైర్‌పర్సన్ పందిరి గీత

ప్రతిపక్షం, చిట్యాల, మార్చి 6: చిట్యాల 12వ వార్డులో 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పందిరి గీత రమేష్, వైస్ ఛైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, కౌన్సిలర్లు, కమిషనర్ దండు శ్రీను ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పందిరి గీత రమేష్ మాట్లాడుతూ... పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం వారే స్వయంగా చీపుర్లు పట్టి వీధుల్లోని చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. వార్డు అంతటా పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితిని సమీక్షించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

మెడికల్ విద్యార్థులకు బస్సుల సౌకర్యం

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 6 : మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకొని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఎంపీ ల్యాడ్స్ నిధుల నుండి రూపాయలు 80 లక్షలు మంజూరు చేసి మూడు బస్సులను శుక్రవారం అందజేశారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు సందర్శించిన సమయంలో విద్యార్థుల హాస్టల్ కు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ వంశీకృష్ణ గారి దృష్టికి తీసుకువచ్చారు దీనిపై వెంటనే స్పందించిన ఎంపీ వంశీకృష్ణ ఎంపీ లాడ్స్ నెల నుండి రూపాయలు 80 లక్షల కేటాయించి మూడు బస్సులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్కు సూచించారు ఈ సందర్భంగా ఎంపి వంశీకృష్ణ మాట్లాడుతూ గతంలో కాలేజీకి వచ్చినప్పుడు విద్యార్థులు హాస్టల్ కు వెళ్లడానికి ట్రాన్స్పోర్ట్ సౌకర్యం లేదని చెప్పారని ఆ సమస్యను పరిష్కరించేందుకు రూపాయలు 80 లక్షల నిధులతో మూడు బస్సులను అందజేయాలి తెలిపారు విద్యార్థులు కష్టపడి చదివి మంచిర్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడిందని పేర్కొన్నారు విద్య మన హక్కు విద్యతోనే మన భవిష్యత్తు అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులు మెడికల్ కాలేజ్ సిబ్బంది విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలంటే..

యాక్షన్ ప్లాన్ అమలు కీలకం!

- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని వెల్లడి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 6 : క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ప్రభుత్వం చేపట్టిన యాక్షన్ ప్లాన్ అమలు కీలకమని టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. మెదక్ కలెక్టరేట్లో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు కావాలని ఆమె అన్నారు. ప్రతి శాఖ అధికారి సమయపాలన పాటిస్తూ, అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని నిర్మల జగ్గారెడ్డి సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. యాక్షన్ ప్లాన్‌లో నిర్ణయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లా అభివృద్ధికి సమిష్టిగా పనిచేయాలి

- ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జీ మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల్లో పారదర్శకత ఉండాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం చూపడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు పేద ప్రజలకు అందే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు. అధికారులు గ్రామాల వారీగా ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడానికి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేష్ శెట్కార్, రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు రోహిత్ రావు, సంజీవ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా

ఇండ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 6 : హత్నూర మండలం, మంగపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామంలో పూరి ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులు ఇవ్వాలని అధికారులనుఆదేశించారు. గ్రామంలో మంజూరైన ఇండ్ల సంఖ్య, నిర్మాణ దశలు, లబ్ధిదారుల ఖాతాల్లో నిధుల జమ వంటి అంశాలపై పై ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈలతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లకు ఫోటో క్యాప్చరింగ్ వెంటనే పంపాలని ఆదేశించారు. అలాగే స్లాబ్ పనులు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు ఏప్రిల్ 20 26 వరకు నిర్వహించే సంక్షేమ మహోత్సవాల సందర్భంగా గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులు తమ స్వంత ఇళ్లలో నివసించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిర్మాణంలో వున్న ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని , ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులు ఇవ్వాలని ఆదేశించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో నీటి వనరులను పరిశీలించి అవసరమైన చోట్ల బోర్లు మరమ్మతులు చేయడం, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తుగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. అనంతరం హత్నూర మండలం కసాల గ్రామంలోని డీసీఎంఎస్ ఎఫ్ఎస్సీ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలను పరిశీలించారు. విక్రయాలకు సంబంధించిన రికార్డులు, బిల్లుబుక్స్, స్టాక్ బోర్డు వివరాలను తనిఖీ చేసి అధికారులను పలు విషయాలపై ప్రశ్నించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరిపడా నిల్వలో ఉంచాలని, ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. హౌసింగ్ పిడి చలపతి రావు , సర్పంచ్ మన్నే రాధా రమేష్, తహసీల్దార్, ఎంపీడీఓ ,పంచాయితీ సెక్రటరీ, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

మహిళల పట్ల వివక్ష చూపుతున్న కేంద్ర ప్రభుత్వం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు ఆశాలత,ఇష్టా విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ తులసి, రజిత

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 6: మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు, ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు ఆశాలత, ఇష్టా విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ తులసి, రజిత లు అన్నారు. సిఐటియు, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో పటాన్ చెరు శ్రామిక్ భవన్ లో కేంద్ర ప్రభుత్వ విధానాలు మహిళలపై ప్రభావం అనే అంశంపై నిర్వహించిన సెమినార్ లో వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. దేశంలో మహిళల పట్ల అత్యాచారాలు జరుగుతున్నాయని,గత సంవత్సరంలో కలకత్తాలో జూనియర్ డాక్టర్ పైన అత్యాచారం జరిగి, హత్య చేసిన విషయంలో కేంద్ర ప్రభుత్వం సమయానికి స్పందించలేదని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు రోజు దేశంలో ఎన్నో జరుగుతున్నాయని, మహిళలకు భద్రత కరువైందని వాపోయారు. స్వాతంత్రం వచ్చి ఇన్నాళ్లయిన మహిళలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదని మహిళలకు వంటింటికే పరిమితం కావాలనీ పద్ధతులు విడనాడాలని చెప్పారు. కార్పొరేట్ శక్తులు తమ వ్యాపారాన్ని సునాయాసం చేసుకోవడం కోసం నేటికీ ఆడవాళ్ళ ఫోటోలు ప్రచార ఆర్భాటాలలో వాడటం దుర్మార్గమన్నారు. మహిళలు అనేక పరిశ్రమలో పనిచేస్తున్న, తక్కువ వేతనాలు ఇస్తున్నారని పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనాలు మహిళలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలు ఎంతోమంది ప్రజాప్రతినిధులు ఎన్నికవుతున్న నేటికీ పురుషాధి పత్యమే నడుస్తున్నదని మండిపడ్డారు. అందుకోసం మహిళలందరూ అన్ని రంగాలలో ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఎంతైనా ఉందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో మహిళల సమస్యల గురించి చర్చించవలసిన అవసరం అందరి పైన ఉందన్నారు. అందుకోసం అన్ని ప్రాంతాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను నిర్వహించవలసిన బాధ్యత మహిళల పైన ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరావు, ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లలిత ,సునీత, ఆశా వర్కర్ల సంఘం నాయకురాలు హైమావతి, ఇస్నాపూర్ ,వీరమని, ఇంటి పని వారాల సంఘం నాయకురాలు పద్మ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ మంజుల, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

“

ఉగాది తర్వాత లోకేశ్ సీఎం అయ్యే అవకాశం ఉంది. ఇదే అంశంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చర్చించుకున్నారు. తన కుమారుడితో కలిసి పనిచేయాలని, త్వరలో ఇద్దరం ఢిల్లీ వెళ్లాల్సి ఉంటుందని పవన్‌కు చంద్రబాబు చెప్పారు. ఈ విషయం కేంద్ర నిఘా వర్గాల ద్వారా తనకు తెలిసింది.

- మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్నినాని

ప్రాంతీయం

స్వచ్ఛ దుబ్బాక సాధనే లక్ష్యం

- మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత

ప్రతి పక్షం, దుబ్బాక మార్చి 06: దుబ్బాక మున్సిపాలిటీ పరిశుభ్రతే లక్ష్యంగా పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి, వార్డుల్లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించి, స్వచ్ఛ దుబ్బాక సాధనే లక్ష్యంగా కృషి చేస్తామని దుబ్బాక మునిసిపల్ చైర్పర్సన్ శ్రీరామ్ సంగీత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యచరణ ప్రణాళికా కార్యక్రమం)లో భాగంగా శుక్రవారం దుబ్బాక మునిసిపల్ కార్యాలయం నుంచి అంగడి బజార్ వరకు పాలకవర్గం సభ్యులు, మున్సిపాలిటీ మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన సందేశం వినిపించి, స్థానిక అంగడి బజార్లో వారితో ప్రతిజ్ఞ నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ శ్రీరాం సంగీత రవీందర్ మాట్లాడుతూ రానున్న 99 రోజుల్లో మునిసిపల్ లో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రోజువారి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ముఖ్యంగా అన్ని వార్డుల్లో

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణతో పాటు ప్రజలకు తడి, పొడి, హానికర చెత్తపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.దానితోపాటు కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న వివిధ రకాల పనులతో పాటు ప్రజా సమస్యల దరఖాస్తులను కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. పాలకవర్గం, ప్రజలు, అన్ని పార్టీల సహకారంతో దుబ్బాక మున్సిపాలిటీ ని అన్ని రంగాల్లో మరింత ముందంజలో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, మునిసిపల్ వైస్ చైర్మన్ ఆస సులోచన స్వామి , మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్,సీనియర్ అకౌంటెంట్ అనిల్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ ఎస్. రాజేశ్వర్ పరిశీలించి, పాలకవర్గంతో సమీక్ష సమావేశం నిర్వహించి, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కృషి తీసుకోవాలని కోరారు. ఆ తర్వాత 19వ వార్డులో చేపట్టిన పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలను మునిసిపల్ చైర్పర్సన్ శ్రీరామ్ సంగీత, మునిసిపల్ కమిషనర్ రమేష్ కుమార్ తో కలిసి ఆయన పరిశీలించారు.వారి వెంట టిపిఓ గిరిధర్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు గట్ల మల్యాల విద్యార్థులు

- **రాష్ట్ర స్థాయి సాప్ట్ బాల్ పోటీలకు నలుగురు విద్యార్థులు**
- **గట్లమల్యాల విద్యార్థుల క్రీడా ప్రతిభ**

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 6 :పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి 69 వ ఎస్జీఎఫ్ఐ సాఫ్ట్ బాల్ క్రీడాబోటీలకు గట్లమల్యాల ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెలలో మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ లో జరిగిన 69వ ఎస్జీఎఫ్ఐ 14 ఏళ్ల లోపు జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో గట్ల మల్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.అర్పిత, డి.దీపిక, బి.అర్చన, ఆర్.దీక్షిత్ లు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఏముకయ్యారు. ఈ ఈనెలలో మహబూబాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఈ విద్యార్థులు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు మాదాసి రమేశ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయిన విద్యార్థులను, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు దర్శనాల రాజ్ కుమార్ ను ప్రధానోపాధ్యాయుడు మదాసి రమేశ్, గ్రామ సర్పంచ్ ఇంగ నరేశ్, ఉప సర్పంచ్ తిప్పని శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కమిటీ చైర్మన్ బి సరోజన, ఉపాధ్యాయులు అశోక్, విజయ కుమార్, చిప్ప దత్తాద్రి, నోముల లింగం తదితరులు అభినందించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రతి పక్షం, దుబ్బాక, మార్చి 06: దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిలో పాత పెండింగ్ ఫైల్స్ క్లియర్ చెయ్యాలని, క్లియర్ చేశాక ఫోటోగ్రఫీ తీసుకుని డాక్యుమెంట్ చెయ్యాలని, 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో ప్రతిరోజు ఏఏ కార్యక్రమాల నిర్వహణ గూర్చి ప్రజలకు తెలిసేలా బయట ఒక బ్యానర్ పెట్టుకోవాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు.అనంతరం అటెండెన్స్ రిజిస్టర్ ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. ఆసుపత్రి సిబ్బంది సమయ వేళలు పాటిస్తున్నారా ? ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు.



ఎంపీ కృషి వల్లే వేములవాడ, చేగుంట ఆర్టీసీ బస్సులు ప్రారంభం

ప్రతి పక్షం దుబ్బాక మార్చి. 06: దుబ్బాక లో గల ఆర్టీసీ బస్ డిపోలో బస్సుల సంఖ్య పెంచాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఇటీవల ఆర్టీసీ జనరల్ మేనేజర్ ని మర్యాద పూర్వకంగా కలిసి దుబ్బాక నుండి వేములవాడ,చేగుంట రూట్లలో బస్ నడపాలని విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ యాజమాన్యం స్పందించి, వేములవాడ, చేగుంట రూట్లలో మూడు సర్వీసులు ప్రారంభించగా, శుక్రవారం మరో మూడు సర్వీస్ లను దుబ్బాక కొత్తపల్లి కామారెడ్డి రూట్ల లో బిజెపి నాయకుల ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగిందని బి జే పి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి జే పి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ ,దుబ్బాక నియోజక వర్గం ఇన్చార్జ్ ఎస్ ఎన్ చారి ,జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్తు. తిరుమల రెడ్డి, దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు దోరగొల్ల. శ్రీకాంత్ యాదవ్, దుబ్బాక మున్సిపల్ కౌన్సిలర్ లు మెరుపుల సాయి కుమార్ గౌడ్, గంభీర్పురం. కనకరాజు, బి జే పి నాయకులు కాపర బోయిన శ్రీనివాస్, కారంకంటి రాజు, పెంటం మహేష్ తదితరులు పాల్గొన్నారు

గోటి తలంబ్రాలు ఓలిచి అందించిన గజ్వేల్ ఏసీపీ

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 06: శ్రీరామనవమి రోజున జరగనున్నభద్రాచల రామయ్య కళ్యానానికి గోటి తలంబ్రాలు ఓలిచి "రామ" భక్తిని చాటుకున్నారు గజ్వేల్ ఏసీపీ నర్సింలు. శుక్రవారం నాడు శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, రామకోటి రామరాజు ఏసీపి చే రామనామ స్మరణ చేపిస్తూ గోటితో వడ్లు ఓలిచి గోటి తలంబ్రాలను రామకోటి రామరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామరాజు నిరంతరం రాముని సేవలో ఉండడం అయన రామభక్తికి నిదర్శనం అన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాదిమంది భక్తులచే గోటి తలంబ్రాలు ఓలిపించి భద్రాచలం పంపడం మళ్ళీ తిరిగి కల్యాణం తరం ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చి అందించడం ఆయన నిస్వార్థ రామభక్తికి అమోఘం అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 06: భారత రాష్ట్ర సమితి పార్టీ మెదక్ మున్సిపల్ మున్సిపల్ 16వ వార్డు కౌన్సిలర్ గా గెలిచినా అవారీ రాజశేఖర్ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కౌన్సిలర్ అవారీ రాజశేఖర్. మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధికభూపతిరాజ్ సమక్షంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కాంగ్రెస్ కండువాను కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రజా సంక్షేమాలే మెదక్ నియోజకవర్గం లో మైనంపల్లి రోహిత్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ మెదక్ భారత రాష్ట్ర సమితి పార్టీ నుండి చాలామంది కాంగ్రెస్ పార్టీలోకి చేరడానికి ఆసక్తి చూపుతున్నారని త్వరలో ఆ పార్టీ ఖాళీ అవుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్ వైస్ చైర్ పర్సన్ దొంతి నరేష్ గౌడ్ తోపాటు కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ మహా ధర్నాను విజయవంతం చేయాలి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 06 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 18 వేలఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతు ఈ నెల 10న హైదరాబాద్ ఎస్పీడీసీఎల్ ఆఫీస్ ఎదుట జరుగు మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ టీవీ ఏ సి జెఎసి నాయకులు గౌ టే భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దకోడూరు సబ్ స్టేషన్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతు ఆర్టిజన్ కార్మికులకు ఏపీ ఎస్ ఈ బి రూల్స్ అమలు చెయ్యాలన్నారు.ఆర్టిజన్ కార్మికులను వారి విద్య అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 3.2016. ఏప్రిల్ కు ముందు అన్ని అర్హతలు ఉండి ఆర్టిజన్ గుర్తించకుండా కార్మికులను తక్షణమే ఆర్టిజన్లుగా గుర్తించాలని యజమాన్యాలను కోరారు. విద్యుత్ సంస్థలో ఎక్కడలేని విధంగా ఒకే సంస్థలోరెండు రూల్స్ అమలు చేసి ఆర్టిజన్ కార్మికులను అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఎస్పీడీసీఎల్ ఎన్ పి డి సి ఎల్ కంపెనీలు మాకు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొమురయ్య పోషినాథ్ ము మహేందర్ రాజేందర్ రామ్ రెడ్డి సతీష్ అశోక్ రాజిరెడ్డి లింగం శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పెద్ద లక్ష్యాలు పెట్టుకోవాలి

- **మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి**

ప్రతిపక్షం,నంగునూరు, మార్చి 6, విద్యార్థులు పెద్ద లక్ష్యాలు పెట్టుకొని పట్టుదలతో కష్టపడితే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అన్నారు. అక్కెనపల్లిలో పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మంద జానయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలను రాసేందుకు ప్రయత్నించాలని సూచించారు. విద్యార్థులు తాము పెట్టుకున్న ఉన్నత లక్ష్యాలకు అనుగుణంగా తమ చదువును క్రమశిక్షణతో కొనసాగించాలని సూచించారు. ప్రిన్సిపాల్ మంద జానయ్య మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి భవిష్యత్తులో విజయాలను చేరాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకులు డా. యస్. శ్రీనివాస్, ఎ. శ్రీనివాస్, సి.హెచ్. రజని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, కష్టపడి చదవడం ద్వారా భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలు, వినోదాత్మక కార్యక్రమాలతో సభను ఉత్సాహభరితంగా మార్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాస్, నర్సయ్య, పర్శరాములు, సుధాకర్, రవీందర్ రెడ్డి, సంపత్, మాధవి, స్వాతి, రాజ్యలక్ష్మి, భానురేఖ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత ఎస్సీ వర్గీకరణపై ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ. వర్గీకరణలో మాదిగల వైపు న్యాయం ఉంది. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డాను. భారతంలో నా ఫేవరెట్ క్యారెక్టర్స్ కర్ణుడు, బర్బరీకుడు. కర్ణుడి మాదిరిగా మాదిగల విషయంలో మిత్ర ధర్మం పాటిస్తూ బర్బరీకుడిలా పనిచేశా.

- సీఎం రేవంత్‌రెడ్డి.

పేదోళ్ల కల నెరవేరుతుంది

- అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం..
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి.రోహిత్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 06 : ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి వారి సొంతింటి కల నెరవేర్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ అన్నారు. రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ ప్రారంభించారు. గత ప్రభుత్వాల హయాంలో ఏ పేదవాడికి కూడా ఒక ఇల్లు నిర్మించి ఇచ్చిన పాపాన పోలేదన్నారు.కానీ ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇండ్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ప్రతి పక్షం, దౌల్తాబాద్, మార్చి 06 : దౌల్తాబాద్ మండలం శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యను బోధించారు. డీఈవోగా అయాజ్, మండల విద్యాధికారిగా వర్షిత, ప్రధానోపాధ్యాయురాలుగా మనస్వినితోపాటు పలువురు విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వయం పరిపాలనతో తమ బాధ్యతలను తెలుసుకుంటారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బోధన అంశంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అమల, హర్షిణి, తదితరులు పాల్గొన్నారు....

14 ఏళ్ల బాలికలకు ఉచిత హెచ్‌పీవి టీకా

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 06: జిల్లాలో 14 సంవత్సరాల వయస్సు గల బాలికలను గర్భాశయ క్యాన్సర్ నుండి రక్షించేందుకు హెచ్పివి టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. ఈ టీకా గురించి అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (DMHO) డాక్టర్ ధనరాజ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని కొన్ని ఎంపిక చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో 14 సంవత్సరాల బాలికలకు హెచ్పివి టీకాను ఉచితంగా అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ టీకా ద్వారా గర్భాశయ క్యాన్సర్ నుండి బాలికలకు రక్షణ కల్పించవచ్చని ఆమె పేర్కొన్నారు.జిల్లా ఆసుపత్రి గజ్వేల్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిద్ధిపేట, ఏరియా ఆసుపత్రి దుబ్బాక, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు నంగునూరు, చేర్యాలు హుస్నాబాద్‌లలో ఈ టీకా అందుబాటులో ఉంటుంది. మార్చి 31 వరకు ఈ టీకాను వేయించుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ఈ టీకా పూర్తిగా సురక్షితమైందని, రుతుస్రావం ఉన్న సమయంలో కూడా తీసుకోవచ్చని వైద్యులు తెలిపారు. జిల్లాలోని 14 సంవత్సరాల బాలికల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ పిల్లలకు టీకా వేయించాలన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట మార్చి 06: తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రజా ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని 99 రోజుల పాటు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరాల ద్వారా మహిళల రుతు సంబంధిత ఆరోగ్య సమస్యలు, కౌమార దశ యువతుల సమస్యలు, కంటి, పంటి, ఎముకల సమస్యలు వంటి వాటికి సంబంధించి జీజీహెచ్ సిద్దిపేట నుండి నిపుణులైన వైద్యులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించి ప్రజలకు దగ్గరలోనే వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, ప్రజలకు వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా మాతాశిశు ఆరోగ్యం, రక్తహీనత, రుతు సంబంధిత సమస్యలు, మానసిక ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో అసంక్రమిత వ్యాధులు, క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించడం, హెచ్ఐవి.ఎయిడ్స్ పై అవగాహన, స్క్రీనింగ్ చేయడం, ఎండాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం మరియు ఓ ఆర్ ఎస్ పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. కీటక జనిత వ్యాధులు, టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో ఆశా వర్కర్లు మరియు ఆరోగ్య కార్యకర్తలు పర్యవేక్షకుల ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సమయానుకూలంగా ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్ బాబ్జి, డిప్యూటీ డీఎంహెచ్వోలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహేందర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, డాక్టర్ మీనా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్య, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సీహెచ్ఓ యాదగిరి ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుర్భాషలాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట , మార్చి 6 : విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ కార్యదర్శి పై దుర్భాషలాడిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని సిద్దిపేట అర్బన్ మండలం పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న భవాని విధి నిర్వహణలో ఉండగా అదే గ్రామానికి డి ప్రశాంత్ కొంతమందితో వచ్చి ఇష్టానుసారంగా మాట్లాడాడని, విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించాడని చట్టరీత్యా అతనిపై చర్యలు తీసుకోవాలని పిటీషన్ లో పేర్కొన్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

ఒక్క నీటి బొట్టునూ తరలించనీయం

- రంగనాయక సాగర్‌ను తపాసుపల్లితో అనుసంధానం వద్దు
- ఓటి నిర్మాణం విరమించుకోవాలి

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 6 : రంగనాయక సాగర్ కుడి కాలువ ఎల్డీ 10 నుండి కమలాయపల్లి శివారు వద్ద డీ 3 కెనాల్ తో అనుసంధానం చేస్తున్న అదనపు ఓటి నిర్మాణ పనులు నిలిపివేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.నంగునూరు మండల బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్ ఆధ్వర్యంలో బీ ఆర్ ఎస్ నాయకులు, మైసంపల్లి, ఖానాపూర్, అంక్షాపూర్, నాగరాజు పల్లి, నంగునూరు, ఘనపురం, అక్కెనపల్లి, గట్ల మల్యాల ఖాతా, సీతారాంపల్లి, కొండంరాజు పల్లి, సంతోష్ నగర్ గ్రామాల రైతులు నీటి పారుదల శాఖ సిద్దిపేట ఎస్ ఈ కి శుక్రవారం వినతి పత్రం అందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న రంగనాయక సాగర్ కుడి కాలువ ఎల్ డీ 10 ను కమలాయ పల్లి శివారులోని డీ3 కెనాల్ తో అనుసంధానం చేసేందుకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని వారు వాపోయారు. ఈ విషయమై ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎంపీ ప్రాతినిధ్యం చేశారని చెప్పారు. అనుసంధానం చేసేందుకు చేపడుతున్న అదనపు ఓటి నిర్మాణ పనులను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన రంగనాయక సాగర్ కుడి కాలువ నుండి 11550 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించిన ఎల్డీ10 కాలువకు నీరు అందడం లేదున్నారు. ఈ ఎల్డీ10 కాలువ దానంపల్లి కమలాయ పల్లి, ఖానాపూర్ అంక్షాపూర్, నాగరాజుపల్లి ద్వారా అలైన్మెంట్ చేశారని చెప్పారు. కమలాయ పల్లి శివారు వద్ద గల రైతులు రంగనాయక సాగర్ కుడి కాలువ ఎల్డీ 10 కాలువను తవ్వడాన్ని వ్యతిరేకించారని తెలిపారు. దీంతో అప్పటి పరిస్థితిలో గ్రామ శివారు పరిధిలో పైప్ లైన్ చేశారని చెప్పారు. ప్రస్తుతం కమలాయపల్లి శివారులోని రంగనాయక సాగర్ కుడి కాలువ నుండి డీ3 కాలువకు ఓటీ ని అనుసంధానం చేయాలని వివిధ రకాల ప్రయత్నాలు చేసి సిద్దిపేట నియోజకవర్గంలోని తమ గ్రామాలలో ప్రతిపాదించిన ఆయకట్టుకు సాగు నీరు అందకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో ఉన్నాడా? ఉంటే ఒక ప్రాంత రైతులే ముఖ్యమా? సిద్దిపేట నియోజకవర్గం రైతులు ఎంపీ దృష్టిలో రైతులు కాదా అని ప్రశ్నించారు. రంగనాయక సాగర్ కుడి కాలువ నుండి తపాసుపల్లి రిజర్వాయర్ డి3 కాల్వకు ప్రతిపాదనలు లేని ఆయకట్టుకు అనుసంధానం చేయడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. రంగనాయక సాగర్ కుడి కాలువ ఎల్ డీ 10 పై ఓటీని నిర్మించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తమ గ్రామాల రైతులను ఆదుకోవాలని కోరుతూ ఎస్ ఈ కి వినతి పత్రం అందించారు. ఓటీ నిర్మాణ పనులు విరమించుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం అని హెచ్చరించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మానవత్వంతో స్పందించిన సర్పంచ్

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 6: మానవత్వం పరిమళించే మంచి మనసుకు స్వాగతం అన్న గాన నేపథ్యాన్ని గుర్తుచేస్తూ స్పందించిన మహిళా సర్పంచ్ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం పోలంపల్లిలో జరిగింది. గత నాలుగు రోజుల క్రితం చేగుంట మండలం పోలంపల్లి గ్రామ శివారులో అనాథ శవాన్ని గుర్తించారు. సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేశారు. అనాథ శవానికి తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మరుచూరులో భద్రపరిచిన అనంతరం మృతుని ఆచూకీ తెలవకపోవడంతో శవాన్ని పొలంపల్లి సర్పంచ్ రాజ్యలక్ష్మి కి పోలీసులు అప్పగించారు. దీంతో సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి దంపతులు సఫాయి కార్మికుల అండతో అంత్యక్రియలు నిర్వహించి వైకుంఠధామం వద్ద పూడ్చి పెట్టారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

ప్రతిపక్షం,మెదక్ టౌన్,మార్చ్ 06 తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా శుక్రవారం కళాశాల అధ్యాపకులకు, సిబ్బందికి పలు సూచనలు చేసి వివిధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ తెలిపారు.ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి నుండి 99 రోజులపాటు తెలంగాణ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వంలోని అన్ని శాఖలలోనూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కళాశాల విద్యాశాఖ సూచించిన విధంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుటకు వివిధ కమిటీలను ఏర్పాటుచేసి సమన్వయకర్తలను,సభ్యులను నియమించమన్నారు.వీరి ఆధ్వర్యంలో కళాశాల విద్యాశాఖ సూచించిన విధంగా కళాశాల పరిసరాలను అందంగా తీర్చిదిద్దడం,ఈ వేస్టేజ్ ని గుర్తించడం, వివిధ రిపేర్లను చేయించడం,ప్రయోగశాలల తీర్చిదిద్దడం, సానిటైజేషన్ , వంటి అంశాలలో వివిధ కార్యక్రమాలను నేటి నుండి 10 రోజులపాటు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రగతి ప్రణాళిక గురించి కళాశాల అధ్యాపకులకు, సిబ్బందికి ప్రిన్సిపల్ వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తిరుమలరెడ్డి, సింహారెడ్డి, ప్రవీణ్ కుమార్, నాగేంద్రరావు, శ్రీలత, పరిపాలనాధికారి అంజాద్ అలీ, సూపరింటెండెంట్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఆహ్వానం

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), మార్చ్ 06: ఈనెల 8 నుండి జరగనున్న నాచగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు హాజరు కావలసిందిగా కోరుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు శుక్రవారం నాడు ఆలయ చైర్మన్ రవీందర్ గుప్తా, కార్య నిర్వహణ అధికారి రంగాచారిలు ఆహ్వాన పత్రిక అందజేశారు. అంతేకాకుండా ఇదే సందర్భంలో రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి లకు అందజేశారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ బాధ్యులు వంటేరు ప్రతాప రెడ్డి తో పాటు దేవస్థాన సహాయకులు సుధాకర్, రిటైర్డ్ ఉప ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, పురోహితులు గోపాలకృష్ణ శర్మ, నాగరాజు శర్మ పాల్గొన్నారు.

బక్రి చెప్యాల జెడ్పీ పాఠశాలలో ఆహారం ఉత్సవం

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్ధిపేట, మార్చి 6 : బక్రి చెప్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆహార ఉత్సవాన్ని నిర్వహించారు. సిరి ధాన్యాల వినియోగం, ఆహార సంరక్షణలో సిరి ధాన్యాల ప్రాధాన్యతను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు వివిధ రకరకాల సిరి ధాన్యాలతో భిన్నమైన వంటకాలను తయారు చేసుకుని వచ్చి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారం నాగేందర్ రెడ్డి సిరి ధాన్యాల ప్రాధాన్యతను తెలిపారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు మామిడి పూర్ణ చందర్ రావు మాట్లాడుతూ సాంఘిక శాస్త్ర ప్రయోగశాలలోని సిరి ధాన్యాల ప్రదర్శన బోర్డ్ సహాయంతో వాటి ఉపయోగాలను వివరించారు. సైన్స్ ఉపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ సిరి ధాన్యాలతో రకరకాల వంటకాల తయారీ విధానాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుహాసిని, శ్రీశైలం, వర్కోలు లక్ష్మయ్య, శ్రీనివాస్, యాదమ్మ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా సరిగ్గా ఆడట్లేదు. అతడిని వెనకేసుకొస్తున్న వారికి స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కి సపోర్ట్ చేయడానికి ఎందుకు సమస్య? మూడు మ్యాచ్‌లలో రన్స్ ఇవ్వగానే వేరే బౌలర్ కోసం చూస్తున్నామని చెబుతారు. ఆ కొత్త ప్లేయర్ రాణిస్తాడనే గ్యారంటీ ఏమిటి?.

- మాజీ క్రికెటర్ సెహ్వాగ్

ప్రాంతీయం

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

- జిల్లా అభివృద్ధి సమిష్టిగా కృషి చేయాలి
- జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలి
- ప్రజలను భాగస్వాములు చేయాలి
- వేసవి నీటి ఎద్దడిపై ప్రతిపాదనలు ఇవ్వండి
- జిల్లా ఇంచార్జీ మంత్రి గడ్డం వివేక్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 06 : రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టంగా తీసుకున్న ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా చేయాలని జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజల సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంటుందని. జిల్లా ఇంచార్జీ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెదక్ ఉమ్మడి జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రజాప్రతినిధులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై సన్నహక సమావేశం నిర్వహించారు సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న మంత్రికి జిల్లా కలెక్టర్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు పోలీస్ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణలో ఉమ్మడి మెదక్ జిల్లాను మొదటి స్థానంలో ఉండేలా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రజలతో మమేకమై వారితో కలిసి పనిచేసి నప్పుడే సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అవకాశం ఉందని సీఎం భావించి ఈ కార్యక్రమంను తీసుకొచ్చారు దీన్ని అమలుచ్చేసే భాద్యత అధికారులదే అన్నారు. వేసవికాలంలో త్రాగునీరు సమస్యరాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని అవసరమైన ప్రాంతాలలో బోర్ల రిపేర్లు, ప్రత్యామ్నాయ తాగునీరు సరఫరాకు ప్రతిపదనలు పంపాలన్నారు. అసెంబ్లీలో చర్చించి త్రాగునీరు సమస్య రాకుండా కావలసిన తాత్కాలిక పనుల కోసం అనుమతులు తీసుకుంటాను అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమంలో భాగంగా 10 థీమ్స్ లలో రూపొందించిన కార్యక్రమాలను ఆయా శాఖల ద్వారా పకడ్బందీగా నిర్వహించాలని వాటితో పాటు 99 రోజుల ప్రణాళికను అన్ని శాఖలచే నిర్వహించాలని సూచించారు. నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ ఫెడ్ వారు నిర్మించిన

ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీనీ ప్రారంభించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానన్నారు. సోషల్ వెల్ఫేర్ ట్రైబల్ వెల్ఫేర్ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో త్రాగునీరు సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు సూచించాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకునేలా వారిని మానిటర్ చెయ్యాలన్నారు. గుమ్మడిదలలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సోలార్ విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించే సూర్య ఘర్ యోజన పథకం పై రివ్యూ చెయ్యాలన్నారు. ఏటిసిలు త్వరగా నిర్మాణం అయ్యేలా టిజీఐఐసి చర్యలు తీసుకోవలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో 6 గ్యారంటీలు ప్రజలకు పూర్తిగా అందేలా చూడాలని, నిర్మాణంలో ఉన్నఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులచే గృహప్రవేశాలు చేయించాలని అన్నారు. మన దేశ అవసరాలకు మించి వరి పంట దేశంలో పండుతుందని రైతులు లబ్ధి పొందేలా 30% పంట మార్పిడి చేయించాలన్నారు.

అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్ ఫామ్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. విద్యా, వైద్యం చాలా ముఖ్యమని పేద ప్రజలకు నాణ్యమైన విద్యా,వైద్య సేవలందించాలన్నారు. రేషన్ కార్డ్స్, డిజిటల్ హెల్త్ కార్డ్స్ అర్హత ఉన్న పేదలందరికీ అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గత ప్రభుత్వం రామాయంపేట ఆర్డిఓ కార్యాలయాలు ప్రారంభించినప్పటికీ అక్కడ ఆర్డిఓ ఉండడం లేదని వెంటనే ఆర్డిఓ ను ఏర్పాటు చేయాలని అలాగే నూతనంగా ఏర్పాటైన మండలలో ఒకే వద్ద ఎమ్మార్వో ఎంపీడీవో పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసే విధంగా నూతన భవనాలను ఏర్పాటు చేయాలని

దుబ్బాకలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చెయ్యాలని, కొత్త మండలాల ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. ప్రతీ సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షా 25 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు.రవాణా శాఖ డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేటప్పుడు రోడ్డు భద్రత నియమాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ నిర్మాణాలు, రహదారులు, పరిశ్రమలలో కాలుష్యాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాల నుండి డీజిల్ ను తీసేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థకు సిద్దిపేట పట్టణంలో అర ఎకరం స్థలం కేటాయించాలని, నార్మట్టలో నిర్మించిన ఆయిల్ ఫెడ్ సూచించారు. ఎంపీ సురేష్ షట్కర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంపై గ్రామ స్థాయిలో ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,మహిళలకు హెల్త్ ప్రొఫైల్ చెక్ చేయాలని,వైద్య పోస్టులు భర్తీ చేయాలని,డాక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మత్తు చేయాలన్నారు. ముఖ్యంగా రైతు బీమా పథకాన్ని వ్యవసాయ సంబంధించిన యాప్ లో యాడ్ చేయాలని దీనివల్ల రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని ఆయన తెలిపారు యాప్ లో రైతు బీమా పథకాన్ని అమలు చేయకపోతే రైతుకు పెద్ద నష్టం జరుగుతుందని ఆయన అన్నారు ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు ప్రతి గ్రామంలో ప్రతి రైతును యాప్ లో యాడ్ చేయవలసిందిగా వ్యవసాయ అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో డంపింగ్ యార్డ్ లు ఏర్పాటుచేయాలి. వాహనాలు అధికంగా నడిచే ప్రాంతాల్లో అండర్ పాస్ నిర్మించాలని, అపోజిట్ లో వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకువాలని, ఆయిల్ ఫామ్అధికంగా సాగు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఒపీ ఫీజులు వసూలు చేయకుండా చూడాలన్నారు.

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. పాల ఉత్పత్తులు పెంచాలన్నారు. నారాయణఖేడ్ ప్రాంతాలలో పాఠశాలలో ఉపాధ్యాయులకు డిప్యూటీషన్ ఇవ్వడం ద్వారా అక్కడ పనిచేయడానికి ఎవరు ముందుకు రావడం లేదని వైద్య మరియు పాఠశాలలో డిప్రెషన్ ఇవ్వకుండా ఉండాలని జిల్లా అధికారులకు అయిన విజ్ఞప్తి చేశారు శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పనులు ప్రారంభించాలన్నారు. జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేసి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టగా తీసుకున్న ప్రగతి ప్రణాళిక ప్రజాపాలన విజయవంతం చేయాలని ప్రజా ప్రతినిధులు ప్రజలను సమన్వయం చేస్తూ ఈ పథకాలను విజయవంతం చేయాలని ఆయన అన్నారు. టి జి ఐ ఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. బసవేశ్వర ప్రాజెక్ట్ పనులు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలన్నారు . భూములు కోల్పోయిన వారిని ఆదుకోవాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని,ఆయిల్ ఫామ్ పంటలను అభివృద్ధి చేయాలన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. జిల్లాలోని 2 నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు.సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ.. అధికారులతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిశీలించేందుకు ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమాన్ని ప్రణాళిక బద్దంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రవీణ్య మాట్లాడుతూ.. "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నేటి నుంచి మార్చి 15వ తేదీ వరకు కొనసాగనున్న పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే అధికారులు తమ తమ కార్యాలయాల్లో ఉన్న పెండింగ్ ఫైల్స్‌ను త్వరిత గతిన క్లియర్ చేస్తామన్నారు.

ముందుగా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, సిద్దిపేట జిల్లా కలెక్టర్, హైమావతి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన మంత్రి కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు, ,మెదక్ అదనపు కలెక్టర్లు నగేష్ ,మాధురి ,అబ్దుల్ హమీద్ , గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి.మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తిరుమల పాదయాత్రలో కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 06 : నిరాధార కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నిర్దోషిగా బయటపడగా, ఆమె అలిపిరి నుండి తిరుమల వరకు పాదయాత్రగా వెళ్లారు. అయితే కవిత పాదయాత్రలో గజ్వేల్ కు చెందిన హైకోర్టు న్యాయవాది, జాగృతి రాష్ట్ర వైస్ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ గతంలో కవిత నిర్దోషిగా బయటపడాలని తిరుమల శ్రీ వెంకటేశ్వరునికి మొక్కుకోగా, శుక్రవారం పాదయాత్రగా వెళ్లి ఆ మొక్కు చెల్లించుకున్నట్లు కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత పై అక్రమ కేసు నమోదు చేసినప్పటికీ చివరకు ధర్మమే గెలిచిందని, అంతేకాకుండా కోర్టులపై సామాన్య ప్రజలకు సైతం నమ్మకం పెరిగిందని వివరించారు.

సీపీఆర్‌తో విలువైన ప్రాణాలు కాపాడవచ్చు

– ఐఎంఏ జనరల్ సెక్రటరీ, ప్రొఫెసర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ గణేష్ వెనిశెట్టి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 06 : ఎవరైనా ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని సీపీఆర్ చేయడం వల్ల విలువైన ప్రాణాలను కాపాడవచ్చని ఐఎంఏ జనరల్ సెక్రటరీ, ప్రొఫెసర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ గణేష్ వెనిశెట్టి, కార్డియాలజిస్ట్ డాక్టర్ అరుణ్ సంతోష్ తెలిపారు. సిద్దిపేట ఇర్కోడ్ మోడల్ స్కూల్‌లో వైద్యులు విద్యార్థులకు సీపీఆర్‌పై శుక్రవారం అవగహన కల్పించారు. ఈ సంధర్భంగా వైద్యులు గణేష్, అరుణ్‌సంతోష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సీపీఆర్‌పై అవగహన కలిగి ఉండడం ఎంతో అవసరంతో పాటు ఉపయోగకరమని తెలిపారు. సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిటేషన్) ప్రాముఖ్యతను వివరించి అత్యవసర పరిస్థితుల్లో చేయాల్సిన ప్రాథమిక ప్రాణ రక్షణ చర్యలను విద్యార్థులు, సిబ్బందికి ప్రదర్శనల ద్వారా అవగహన కల్పించినట్లు తెలిపారు. అదేవిదంగా ప్రస్థుతం విద్యార్థులకు పరీక్షల సమయం కాబట్టి వారు సరైన నిద్ర, సమయ నిర్వహణ, సానుకూల దృక్పథం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు మల్లారెడ్డి ఆహ్వానం

ప్రతిపక్షం, సిద్దిపేట, మార్చి 6 : బి.ఆర్.ఎస్ అధినేత , మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో మాజీ మంత్రి , మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 19 న జరగనున్న తమ 50 వ వివాహ వార్షికోత్సవ (గోల్డెన్ జూబ్లీ) కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికను మల్లారెడ్డి దంపతులు పార్టీ అధినేత కేసీఆర్ దంపతులకు అందజేశారు. వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న సందర్భంగా మల్లారెడ్డి దంపతులకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ ను కలిసిన వారిలో మల్లారెడ్డి కోడలు డా. ప్రీతి రెడ్డి , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి అత్యంత ఉన్నతమైనది

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 6: అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి అత్యంత ఉన్నతమైనదని నంగునూరు మండల విద్యాధికారి, నర్మెట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తగిరెడ్డి దేశి రెడ్డి అన్నారు. దేశ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి మాట్లాడుతూ స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించడం వల్ల నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చెప్పారు. విద్యార్థులు భవిష్యత్తులో బాధ్యతగా వ్యవహరించే అవకాశం ఉంటుందన్నారు. ఒకరోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించిన బాల ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పదవ తరగతి విద్యార్థి రిత్విక్ ప్రధానోపాధ్యాయుడిగా పాఠశాల నిర్వహించారు. భవ్యశ్రీ మండల విద్యాధికారిగా, అమూల్య రెడ్డి జిల్లా విద్యాధికారి బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థులు నిర్వర్తించిన బాధ్యతలను పరిశీలించి ఉత్తమంగా

నిర్వహించిన కె.శ్రీజ, ఎన్.అశ్విత, సాత్విక్ రెడ్డి, అక్షిత్ గౌడ్, ప్రణయ్‌లను గుర్తించి బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆనందాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు గణపతి, ప్రభాకర్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, కనుకయ్య, జనార్దన్ రెడ్డి, గఫూర్, అశోక్, త్రివిక్రమ్ శర్మ, రఫిక్, సాయికృష్ణ, మంగమ్మ, వ్యాయామ ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో రంజాన్ కానుకల పంపిణీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 06 : సిద్దిపేట పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులకు ఆత్మీయ కానుకలను పంపిణీ చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట నియోజకవర్గ శాసనసభ్యులు హరీష్ రావు ఆదేశాల మేరకు ఈ సందర్భంగా అవసరమైన కుటుంబాలకు రంజాన్ కానుకలను అందజేస్తూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ మంజుల-రాజనర్స్, పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి, యేల్లు రవీందర్ రెడ్డి, నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, కుంచం శేఖర్, కంటెం రాజు, కుంచం రవీందర్, దున్నపోతుల సంతోష్, బోదాస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, యువ నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమం ద్వారా ముస్లిం సోదర సోదరీమణులకు పండుగ ఆనందాన్ని పంచుకోవడం జరిగిందని నాయకులు తెలిపారు.

బడుగు బల హీనుల బడ్జెట్ ఖర్చులో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం

డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 06: రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్ సమావేశాలలో ఎస్సీ,ఎస్టీ అభివృద్ధి నిధుల చట్టం కింద కేటాయించిన బడ్జెట్ ఖర్చు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం, వివక్షతను ప్రదర్శిస్తుందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. శుక్రవారం నాడు గజ్వేల్ అంబేద్కర్ భవన్ లో దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) అధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ ఎస్డిఎఫ్ బడ్జెట్ కేటాయింపులు ఖర్చులపై శ్వేత పత్రం ప్రకటించాలని, అంబేద్కర్ అభయాస్తం పథకాన్ని ప్రారంభించాలని, చేవెళ్ల డిక్లరేషన్ ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దాసరి ఏగొండ స్వామి మాట్లాడుతూ 2025 26 బడ్జెట్లో దళితుల ప్రత్యేక నిధి కింద 40,231 కోట్లు కేటాయించగా కేవలం 16, 374 కోట్లు మాత్రమే విడుదల చేయగా 6,726 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరండిబిఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, కళాకారుడు గిరిపల్లి మల్లేశం, బిఎస్పి నాయకులు కనకప్రసాద్ లు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగబద్ధమైన హక్కుల అమలు కోసం బడ్జెట్ నిధుల కేటాయింపు ఖర్చులకోసం ఐక్యంగా ఉద్యమించాలని, చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఎస్సీఎస్టి అత్యాచార బాధితులకు నష్టపరిహారము పునరావసం కల్పించడంలో ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్షాన్ని వివక్షితను ప్రదర్శిస్తుందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం వెంటనే పెన్షన్లను పెంచుతూ జీవో జారి చేయాలని పెన్షన్ల కోసం దరఖాస్తు తీసుకున్న ప్రతి ఒక్కరికి పెన్షన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెజగామా ప్రభాకర్,చంద్రం ,శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

"



పరామర్శల పేరుతో జగన్ ప్రజలకు నరకం చూపిస్తున్నారు. గంజాయి బ్యాచ్ పరామర్శలకు వెళ్లడం సిగ్గుచేటు. వైసీపీ డ్రామాలతో అంబులెన్స్‌లు కూడా చిక్కుకుపోతున్నాయి. వాళ్ల వాహనాల టైర్లు మనుషులను తొక్కేస్తున్నాయి. మళ్లీ ఆ నిందను ప్రభుత్వంపైనే వేసే ప్రయత్నం చేస్తున్నారు. పోస్టుమార్టమ్‌కు కారణమైన వాళ్లు పోస్టుమార్టమ్‌కే వెళతారు.

- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

పోస్టాఫీసుల ద్వారా భద్రాద్రి తలంబ్రాలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 05 : పోస్టాఫీసుల ద్వారా భక్తుల ఇండ్లకు భద్రాద్రి శ్రీ సీతా రామచంద్ర కళ్యాణ తలంబ్రాలు అందజేయనున్నట్లు పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ జనార్ధన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పోస్టాఫీసుల తెలంగాణ పోస్టల్ సర్కిల్ రామనవమి సందర్భంగా భద్రాద్రిలో నిర్వహించే శ్రీ సీతారామ చంద్రస్వామి కళ్యాణోత్సవంలోని పవిత్ర "తలంబ్రాలు", ప్రసాదాన్ని రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల ద్వారా భక్తుల ఇళ్లకు నేరుగా పంపిణీ చేసే ప్రత్యేక సేవను అందిస్తోందని తెలిపారు. గత సంవత్సరాల మాదిరిగానే, భక్తులు భద్రాద్రికి ప్రయాణించాల్సిన అవసరం లేకుండా పవిత్ర తలంబ్రాలను పొందేందుకు తెలంగాణ ఎండోమెంట్స్ శాఖ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టబడుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల ద్వారా భక్తులు క్రింది సేవలను పొందవచ్చు.

1.అంత్రాలయ అర్చన – కళ్యాణ తలంబ్రాలు
భద్రాచల సీతారామ స్వామి కళ్యాణ తలంబ్రాలు ప్యాకెట్
1. ముత్యం, కుంకుమ, మిశ్రీ మరియు కాజు గింజలు కలిగి ఉంటుంది) ధర రూ. 450.
2.ముత్యాల తలంబ్రాలు
భద్రాచల సీతారామ స్వామి కళ్యాణ తలంబ్రాలు ప్యాకెట్
1 ముత్యం కలిగి ఉంటుంది
ధర రూ. 151.

భక్తులు అవసరమైన రుసుము చెల్లించి ఏ పోస్టాఫీసులో నైనా ఈ అవకాశాన్ని పొందవచ్చు. శ్రీ సీతా రామచంద్ర కళ్యాణోత్సవం అనంతరం తలంబ్రాలు స్పీడ్ పోస్టు ద్వారా భక్తుల గృహద్వారాలకు పంపిణీ చేయబడతాయి. 27 మార్చి 2026న భద్రాద్రిలో నిర్వహించనున్న శ్రీ రామ నవమి మహోత్సవాలకు హాజరుకాలేని భక్తులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

ఎంపీ అరవింద్ కు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల వినతి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 06 : బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు, అధికారులకు మూడవ వేతన సవరణ సమస్యపై జిల్లా ఎంపీ అరవింద్ కు బీఎస్ఎన్ఎల్ ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఎంపీ ను బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు కలిసి వినతి పత్రం ఇచ్చి ఈనెల 9 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాలలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు, అధికారులకు జరగవలసిన మూడవ వేతన సవరణను వెంటనే జరిగేలా సహకరించాల్సిందిగా కోరారు. బీఎస్ఎన్ఎల్ లో 2017లో జరగవలసిన వేతన సవరణ ఇంతవరకు జరుగలేదని, నష్టాల బాటలో ఉన్నందున వేతన సవరణ జరపబోమని కేంద్ర ప్రభుత్వం చెప్పిందని. బీఎస్ఎన్ఎల్ సేవా రంగంలో ఉన్నందున మారుమూల పల్లెలలో కూడా లాభాపేక్ష లేకుండా సర్వీసులు అందిస్తూ, తుఫానులు, వరదలు ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు దేశ ప్రజలకు బీఎస్ఎన్ఎల్ తన సేవలను నిరాటంకంగా అందిస్తోందని, నష్టాల లాభ నష్టాలతో ముడి పెట్టకుండా కేవలం సర్వీస్ రంగంగా చూసి ఉద్యోగులకు మూడవ వేతన సవరణ జరిగేలా పార్లమెంట్లో మాట్లాడవలసిందిగా ఎంపీ ను కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించి సహకరిస్తానని హామీ ఇచ్చారు. బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈవీఎల్ నారాయణ, ఎస్ఎన్ఈఏ కార్యదర్శి ఆర్ రాజేందర్, బాబన్న, మధుసూదన్, ఎల్మీ రమణా రెడ్డి, బాల దుర్గయ్య, బాలస్వామి, సాగర్ పాల్గొన్నారు.

'మేము సైతం' ఆధ్వర్యంలో అన్నదానం

ప్రతిపక్షం, జనగామ ప్రతినిధి, మార్చి 6 : పెద్ది నవీన్ గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన తమ్ముడు పాముకుంట్ల మణిదీప్ గౌడ్ మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు తుంగ కౌశిక్ మాట్లాడుతూ జనగామ జిల్లా కేంద్రంలో పెద్ది నవీన్ గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా అనాథలు, ప్రయాణికులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. పుట్టిన రోజు సందర్భంగా సేవ చేయడం మంచి పరిణామం అని, ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు సందర్భంగా పది మందికి సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో గంధమల్ల కమలాకర్, వెమ్మల అభిలాష్ రెడ్డి, గుగ్గిళ్ల శ్రీధర్, గాయకోటి రమేష్, సామ అనిల్, మేము సైతం ఫౌండేషన్ సభ్యులు నీలం శ్రీకాంత్, అనిల్, ఉడి దేవరాజ్, చింతల మనితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి ప్రణాళికలో భాగస్వామ్యం కావాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 6 : వరంగల్ జిల్లా జిడబుల్ ఎంసీ ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్ కలెక్టర్ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా వేగంగా అమలవుతోందని ఈ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ జి డబుల్ ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి ఐదియా మేయర్ శ్రీమతి గుండు సుధారాణి హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు ఇంచార్జ్ కమిషనర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్ పాల్గొన్నారు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రతపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను రూపొందించిందన్నారు. పట్టణాలు, గ్రామాలు సమానంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, శానిటేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం నాయిని రాజేందర్ రెడ్డి పనిచేస్తోందన్నారు. కాలనీలు, వీధుల పరిశుభ్రతను ఉంచేలా మున్సిపల్ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలని ప్రతి పౌరుడు కూడా పరిశుభ్రతను కాపాడటంలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే 99 రోజుల్లో పట్టణాభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి అంశాల్లో స్పష్టమైన మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సానిటరీ సిబ్బంది కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉగాది పండుగ పురస్కరించుకొని లక్ష మందికి ఈ నెల 18న టిడ్కో ఇళ్లు అందజేయనున్నాం. జూన్ నాటికి మిగతా టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం. అటు 2028 కల్లా పట్టణ ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇక టీడీఆర్‌బాండ్ల జారీలో గత ప్రభుత్వం వందల రూ.కోట్ల అక్రమాలకు పాల్పడింది. దీనిపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది.
- ఏపీ మంత్రి నారాయణ

మహిళలకు అవకాశాన్ని ఇవ్వండి.. సమాజ అభివృద్ధిని పొందండి

రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 06 : మహిళలకు అవకాశాలు ఇవ్వటం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడతామని తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు ధనసురి సీతక్క అన్నారు. శుక్రవారం స్థానిక విజయలక్ష్మి గార్డెన్ లో ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతకు అవగాహన సదస్సును నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథులతో జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం వందేమాతర గీతాన్ని ఆలపించి సభను ప్రారంభించారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ 1911లో కమ్యూనిస్టు నాయకురాలు జంక్షన్ అన్నగారి ఉన్న మహిళల అసమానత్వాన్ని నివారించుటకు పోరాటం చేశారు. దాన్ని పురస్కరించుకొని మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా నిర్వహించుకోవడం జరిగింది. ప్రతి సంవత్సరం ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందనీ అందులో భాగంగా 2026 సంవత్సరానికి గాను "గివ్ టు గైన్" అన్న నినాదాన్ని తీసుకోవడం జరిగిందని అన్నారు. మహిళలకు సమాన అవకాశాలను ఇచ్చినట్లయితే వారి నుండి సమాజ అభివృద్ధికి ఎంతో పొందుతామని అర్థాన్నిస్తుందని దానికి అనుగుణంగానే ఐక్యరాజ్యసమితి ఇచ్చిన పిలుపుమేరకు మనందరం మహిళలకు ఆ అవకాశాలను ఇవ్వటమే కాకుండా వారికి బాసట గా నిలుద్దాము అని అన్నారు. మహిళా సాధికారత సాధించడంలో లింగ విభేదాన్ని విడనాడాలని , గివ్ టు గైన్ అన్న నినాదాన్ని సార్థకత చేసుకుంటూ సమాజంలోని ప్రతి ఒక్కరూ మహిళా సాధికారతకు పాటుపడదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన జీవితాన్ని ఒక ఉదాహరణగా ఆదర్శవంతమైన మహిళగా తీర్చి దిద్దుకొనుటకు చదువు ఎంతో ఉపయోగపడిందని మహిళా అభ్యున్నతికి విద్య ఎంతో తోడ్పడుతుందని అన్నారు. చదువు విజ్ఞానాన్ని ఇస్తుందని ఈ విజ్ఞానంతో సమాజంలో రాణిస్తామని అన్నారు. ప్రతి విద్యార్థిని ఒక ఆదర్శవంతమైన వ్యక్తిని ఆదర్శంగా తీసుకొని మన మణంగా సంపూర్ణ వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవటానికి వారి జీవిత చరిత్ర చదివి ఆ అభివృద్ధి వైపుగా అడుగులు వేయాలని అన్నారు. ప్రతి మహిళ కంపాషన్, కమిట్మెంట్, అండ్ కరేజ్ ను కలిగి ఉండాలని, చాలెంజ్ లేని జీవితం చప్పడి కూర వంటిదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ఆధారంగా నేను నా జీవితాన్ని గొప్పస్థాయిలో మలుచుకోగలిగిన అని అన్నారు. పదవ తరగతి చదువుతూ విప్లవోద్యమంలో వెళ్లిన నేను ఒక నక్సలైట్ గా ఏ కోర్టులో నిలుచున్నానో అదే కోర్టులో నేను అడ్వకేట్ గా నిలిచి నా గురుతుల్యులు అయినటువంటి వెంకటస్వామి రెడ్డి నీ ఆదర్శంగా తీసుకుని వారి ఆధ్వర్యంలో అదే కోర్టులో నిర్దోషిగా నిలబడగలిగానని అన్నారు. మహిళగా సమాజంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూనే సమస్యలను అధిగమించేలా ఉండాలని ఆత్మస్థైర్యము , ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. చదువు, క్రమశిక్షణతో మనం మనంగా నిరూపించుకోవాలని అది చదివైనా, పని అయినా ఏ రంగంలోనైనా మనంగా నిరూపించబడాలని అన్నారు. ఓటమి అనేది విజయానికి నాంది అన్న నానుడిని ఆదర్శంగా తీసుకోవాలని అబ్రహం లింకన్, మదర్ తెరిసా, మేరీకాన్ లాంటి ఆదర్శవంతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని మన అభివృద్ధికి అడుగులు వేయాలని అన్నారు. నేడు మహిళా సాధికారతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా అనేకమందికి జీరో వడ్డీ రూపేనా రుణాల అందిస్తూనే అనేక మందిని గొప్ప వ్యాపారవేత్తలుగా కోటి మందిని మహిళా వ్యాపారవేత్తలుగా చేయటమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు అంతేకాకుండా రాష్ట్రంలో 15 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు మహిళా సంఘాలలో సభ్యత్వాలను కల్పించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు కి ఈ ప్రభుత్వం కృషిచేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ చైర్మన్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య మాట్లాడుతూ సమాజంలోని మహిళల విజయాలను యువతగా మీకు పరిచయం చేయాలన్న లక్ష్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా చైతన్యవంతమైన యువతకి అందించాలని లక్ష్యంతో సమాజంలోని చీడపీడలైన డ్రగ్స్ వంటి మహమ్మారిపై అవగాహన కల్పించాలని నేటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు నిజామాబాదు వ్యవసాయ ఆధారిత జిల్లాగా వ్యవసాయము వాణిజ్యము వైద్య పరంగా జిల్లాపై చుట్టుపక్కల ఉన్న జిల్లాలు ఆధారపడి ఉన్నాయని అలాంటి పరిస్థితుల్లో భద్రత కల్పించాలని ఆ భద్రత లో భాగంగా భద్రత , ట్రాఫిక్ భద్రత , సైబర్ భద్రత తదితర విషయాలపై యువతకు అవగాహన కల్పించి చైతన్యవంతులుగా చేయటమే నేటి కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ సందర్భంగా నిజామాబాదు సెక్యూరిటీ కౌన్సిల్ బొచర్లను విడుదల చేశారు. "సురక్ష దీప్" అన్న భద్రతా బోర్డులను ప్రభుత్వ , ప్రైవేటు సంస్థల్లో ఏర్పాటు చేయాలని ఈ "సురక్ష దీప్" ప్రతి మహిళకు వారి సమస్యల పరిష్కారానికి ఒక భద్రతను కల్పించే దిశ గా పనిచేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ , అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా , రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి , నిజామాబాద్ మేయర్ కె.ఉమారాణి, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ కన్వీనర్ డిసిపి(అడ్మిన్) జి. బస్వా రెడ్డి , ట్రెజరర్ కే.సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కవిత రెడ్డి , ఎన్.ఎస్.సి సభ్యులు కాకతీయ కాలేజ్ రజినీకాంత్ , కామారెడ్డి ఏసిపి చైతన్య రెడ్డి , కామారెడ్డి డి.ఎఫ్.ఓ నిఖీత , నుడా చైర్మన్ కేశ వేణు, వివిధ కళాశాలకు చెందిన విద్యార్థిని లు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి ప్రణాళిక అమలులో ముందంజలో నిలుపుదాం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 06 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక అమలులో నిజామాబాద్, కామారెడ్డిలతో కూడిన ఉమ్మడి జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసురి అనసూయ సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక అమలు పై నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా విచ్చేసి, ఉమ్మడి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేయగా, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, మహమ్మద్ షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్ లు ప్రగతి ప్రణాళిక అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక గురించి ఆయా శాఖలు, అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఇంచార్జి మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ పల్లెలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం ఆయా శాఖల వారీగా పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, డ్రగ్స్ కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళలు, పర్యావరణం అంశాలలో నిర్దేశిత లక్ష్యం మేరకు ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉద్యోగులు ప్రగతి ప్రణాళిక అమలులో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు.

పరకాల మున్సిపాలిటీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రతిపక్షం ప్రతినిధి, హన్మకొండ, మార్చి 6 : పరకాల నియోజకవర్గం లో శుక్రవారం పరకాల పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో పరకాల మున్సిపాలిటీ నూతన పాలక మండలి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగ రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరకాల నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల పట్టణ అభివృద్ధి ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పాలక మండలి పని చేయాలి అని అలాగే పరకాల పట్టణాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన అన్నారు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ శ్రీ పావుశెట్టి సునీల్ కుమార్ మరియు పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాతో కౌన్సిలర్లను ఎమ్మెల్యే గారు ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...పట్టణ అభివృద్ధి ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పాలక మండలి పని చేయాలి అన్నారు.పరకాల పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు మున్సిపాలిటీ పాలక మండలి కృషి చేయాలని కోరారు. పరకాల పట్టణ అభివృద్ధికి నూతన కౌన్సిలర్లు మరియు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

గెలిచిన అభ్యర్థులు ప్రజాసేవకే అంకితమవ్వాలి

ఎంపీ ఈటల రాజేందర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 06 : ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలలో గెలిచిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు గెలిచామన్న గర్వంతో ఉండకుండా ప్రజాసేవకే అంకితమవ్వాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు సన్మాన కార్యక్రమాన్ని నగర శివారులోని కమ్మ సంఘంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ఈటల మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు హుందాగా వ్యవహరించాలన్నారు. గెలుపు గర్వంతో ముందుకు వెళ్తే భవిష్యత్తు రాజకీయం అంధకారమవుతుందన్నారు.అలాగే ప్రజలకు సేవ చేసినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. ఒకప్పుడు బీఆర్ఎస్ అహంకారంతో ముందుకు వెళ్లిందన్నారు. ప్రజలు, రైతులను, ఉద్యోగులను పట్టించుకోకుండా అహంకారపూరిత పాలన చేసిందన్నారు. చివరికి ఆ పార్టీలో మట్టిలో కలిసిపోయిందన్నారు. రాజకీయ చరిత్రలో రైతులతో పెట్టుకున్న ఏ పార్టీ కూడా బతికి బట్టకట్టలేదని ఎంపీ పేర్కొన్నారు. డీఎస్ మానవతావాది.

తాను అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సమయంలో ప్రతిపక్షంలో ఉన్న డీఎస్ మాట్లాడుతూ ఒకప్పుడు తన రాజకీయ గురువైన అర్గుల రాజారాం ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్తో ఈటల బడ్జెట్ పోలి ఉందని కితాబునిచ్చారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ డీఎస్ హుందాతనం ప్రదర్శించేవారన్నారు. ప్రతిపక్షం అంటేనే విమర్శించడం కాదని, అధికార పక్షం అటే అధికారం చూపడం మాత్రమే కాదన్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ ఈటల తాను ఇద్దరం కలిసి రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొస్తామన్నారు. తెలంగాణ మొత్తంలో నిజామాబాద్లోనే అత్యధిక కార్పొరేటర్ కౌన్సిలర్ సీట్లు బీజేపీ గెలిచిందన్నారు. మేయర్ పదవి కొరకు మరో రెండు సీట్లు అవసరం ఉన్నప్పటికీ తాము ఎవరిని కొనుక్కొని రాజకీయాలు చేయలేదన్నారు. హిందువులలో అత్యధిక కార్పోరేటర్ సీట్లను తాము గెలిచామని, మిగిలిన వాటిని కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కై మేయర్ సీటును కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అంతేగానీ ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ మేయర్ సీటును అందుకోలేదన్నారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ బీజేపీ తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో ఇందూరు పార్లమెంటు పరిధిలో అత్యధిక ఎమ్మెల్యేలను గెలిపిస్తానని తెలిపారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ గెలుపొందిన కార్పోరేటర్లు కౌన్సిలర్లు ప్రజలతో మమేకం అవ్వాలని అన్నారు. నిత్యం అభివృద్ధి కోసం ఆలోచన చేయాలని, దీంతో ప్రజల చేయూత ఎప్పటికీ ఉంటుందన్నారు. అలాగే రాజకీయ భవిష్యత్తు కూడా మెండుగా ఉంటుందన్నారు. తాను నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి తీసుకొస్తానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ ఇటీవల ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ భవిష్యత్తులో మేయర్ పీఠాన్ని తాము కైవసం చేసుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. ఎంపీ ఏదైనా మాట్లాడితే కచ్చితంగా చేసి తీరుతారని దానికి ఒక అర్థం ఉంటుందన్నారు. రాబోయే ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకొని జిల్లా పరిషత్ ఛైర్మన్ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మరో ఎక్స్ అఫీషియో ఓటు బీజేపీకి వస్తుందని అలాగే మరో ఎమ్మెల్సీ స్థానం కూడా ఖాళీ అవుతుందని అది కూడా బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. దీంతో ఎక్స్ అఫీషియల్ సభ్యుల సంఖ్య కాంగ్రెస్ కంటే తమకే ఎక్కువగా పెరుగుతుందని చెప్పారు. అలాగే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రూరల్ ఎమ్మెల్యే ను గెలిపించుకోవాలని దాంతో మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. అనంతరం నూతన కౌన్సిలర్లు, కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, జిల్లా ప్రభారి కాంతారావు, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం..

ఎంపీలకు విప్ జారీచేసిన బీజేపీ, కాంగ్రెస్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 6: వచ్చే వారం లోక్‌సభలో స్పీకర్ పై కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం పెట్టబోతుంది. ఈ నేపథ్యంలో ఈ తీర్మానంపై ఉత్కంఠ నెలకొంది. అందుకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ప్రతి ఒక్కరూ సభలో చర్చ, ఓటింగ్ సందర్భంగా అందుబాటులో ఉండాలని ఆదేశించాయి. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను పదవి నుంచి తొలగించాలని కోరుతూ గత నెలలోనే కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇచ్చాయి. దీనిపై ఈనెల 9, 10 తేదీల్లో చర్చ, అనంతరం ఓటింగ్ జరగనుంది. అందువల్ల ఈ రెండు రోజుల్లో తమ ఎంపీలు అందరూ సభకు హాజరవ్వాలని, అందుబాటులో ఉండాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ఈ మేరకు తమ ఎంపీలు సభలో ఉండి, ప్రభుత్వానికి మద్దతు తెలపాలని బీజేపీ సూచించింది. స్పీకర్ ఓంబిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని కోరుతూ గత నెలలో ప్రతిపక్షాలకు చెందిన 118 మంది ఎంపీలు సంతకాలు చేసి, నోటీసులు ఇచ్చారు. అయితే, నోటీసు ఇచ్చిన తర్వాత నుంచి సభ వాయిదా పడి కార్యకలాపాలు నిలిచిపోయాయి. కేంద్ర బడ్జెట్ పై రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి దశ సమావేశాలు అర్థాంతరంగా వాయిదాపడ్డాయి. సభలో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో సమావేశాల్ని వాయిదా వేశారు. రెండో దశ బడ్జెట్ సమావేశాల్లోనే ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెడతారు. తర్వాత దీనిపై చర్చ, ఓటింగ్ ఉంటాయి. ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు స్పీకర్ చైర్‌లో ఓం బిర్లానే ఉంటారు. సోమవారం ప్రారంభం కానున్న చర్చ సమయంలో మాత్రం ఆయన సాధారణ ఎంపీలాగే సభలో కూర్చుంటారు.



విశ్వ వీక్షణం

దేశ అభివృద్ధికి అంతర్గత భద్రత ముఖ్యం

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 6 : 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారాలంటే అంతర్గత భద్రత చాలా కీలకమని అమిత్ షా పేర్కొన్నారు. దేశంలోని కీలక ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్ దళాలు పటిష్ఠ భద్రతను కల్పిస్తూ ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తున్నాయని చెప్పారు. దేశంలోని వివిధ జలాశయాలు, పరిశ్రమలు, విమానాశ్రయాలు, పార్లమెంట్ వంటి ముఖ్యమైన ప్రాంతాలకు రక్షణను అందిస్తున్నాయని చెప్పారు. అయితే, దేశంలో శాంతి వాతావరణం నెలకొన్నప్పుడే ఆర్థిక వృద్ధి సాకారమవుతుందని షా చెప్పుకొచ్చారు. అదేవిధంగా, దేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలంటే పరిశ్రమల అభివృద్ధి అవసరమని షా నొక్కి చెప్పారు. అయితే, ఆ బాధ్యతను సీఐఎస్ఎఫ్ సమర్థంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. దేశంలో నక్సలిజాన్ని తుదముట్టించాలని మోదీ సర్కార్ తీసుకున్న సంకల్పాన్ని పూర్తిచేయటంలో సీఐఎస్ఎఫ్ కీలకభూమిక పోషించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ లేదా తెలంగాణలో నక్సలిజాన్ని నిర్మూలించడంలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఒడిశా కటక్‌జిల్లాలోని ముండలిలో జరిగిన సీఐఎస్ఎఫ్ 57వ వార్షికోత్సవంలో పాల్గొన్న అమిత్ షా తిరుపతి నుంచి పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కనేవారి కలలను భద్రతా దళాలు కల్లలు చేశాయన్నారు. ఇదిలా ఉండగా, సీఐఎస్ఎఫ్ స్థాపించి 56 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆ దళాలు సాధించిన పురోగతిని అమిత్ షా ప్రశంసించారు. సీఐఎస్ఎఫ్ చిన్న స్థాయిలో ప్రారంభమై, ప్రస్తుతం పారిశ్రామిక భద్రత రంగంలో అగ్రస్థానానికి చేరుకుందని కొనియాడారు. దేశ చరిత్రలో ధైర్యం, త్యాగం, అంకితభావంతో ఈ దళం ప్రతి సవాల్‌ను సమర్థంగా ఎదుర్కొందని, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించిందని పేర్కొన్నారు. సీఐఎస్ఎఫ్ లేకుండా దేశ పారిశ్రామిక అభివృద్ధి దార్శనికతను ఊహించలేమన్నారు. మరోవైపు, దేశంలోని అన్ని ఓడరేవుల భద్రతా బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ప్రైవేట్ పరిశ్రమలకు కూడా హైబ్రిడ్ విధానంలో భద్రత అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఎండాకాలంలో శరీరంలో నీటి శాతం తగ్గి బాడీ డీహైడ్రేషన్‌కు గురవుతుందని మనందరికీ తెలుసు

మరి చలికాలంలో కూడా మన ఆహారపు అలవాట్ల వల్ల డీహైడ్రేషన్‌కు గురవుతామని ఎంతమందికి తెలుసు..

చలికాలంలో డీహైడ్రేషన్‌కి కారణాలేంటి? దీని నుండి తప్పించుకోవాలంటే ఏం చేయాలి?

డీహైడ్రేషన్ దూరం చేసుకోండి

అయాన్

శరీరంలో నీరు లేకపోవడం అంటే డీహైడ్రేషన్ తీవ్రమైన సమస్య. రోజూ 8 గ్లాసుల నీరు తాగాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు, అయితే చలికాలంలో దాహం తక్కువగా ఉండటం వల్ల చాలా మంది నీరు తీసుకోవడంపై శ్రద్ధ చూపక డీహైడ్రేషన్ బారిన పడుతున్నారు. అటువంటి పరిస్థితిలో డీహైడ్రేషన్ సమస్యను పెంచే కొన్ని విషయాల గురించి తెలుసుకుందాం. పని ఒత్తిడి లేదా బిజీ లైఫ్ స్టైల్ వల్ల మనం తరచుగా నీరు తాగడం మర్చిపోతున్నాం, అది డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. అధిక దాహం, కళ్లు ఎర్రబడడం, ముదురు పసుపు రంగులో మూత్రం రావడం దీని లక్షణాలు. డీహైడ్రేషన్‌నుంచి తప్పించుకునేందుకు ఉత్తమమైన పరిష్కారం నీరు ఎక్కువగా తాగడమే! చాలా సార్లు మనం బీజీ లైఫ్‌లో హడావిడిగా తినటం లేదా త్రాగటం చేస్తుంటాం.. ఇది మన శరీరానికి హాని కలిగించవచ్చు. సరైన పరిమాణంలో నీరు తీసుకోవడంతో పాటు సరైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్‌ను నివారించవచ్చు.

టీ, కాఫీలు తగ్గించాలి

కాఫీ, టీలో కెఫిన్ ఉంటుంది, ఇది దీని అర్థం శరీరం నుండి నీటిని తొలగిస్తుంది. టీ, కాఫీలు అధికంగా తీసుకోవడం వల్ల మూత్రం ఎక్కువగా వస్తుంది. దీంతో ఒంట్లో నీటి పరిమాణం తగ్గి డీహైడ్రేషన్ బారిన పడతాం. కాబట్టి కాఫీ, టీలు వీలైనంత తగ్గించుకోవడం మంచిది.

కార్బోనేటెడ్ డ్రింక్స్

సోడా, కూల్‌డ్రింక్స్ ఇతర కార్బోనేటెడ్ పానీయాలలో ఫాస్పోరిక్ ఆమ్లం ఉంటుంది, ఇది శరీరంలో కాల్షియం, మెగ్నీషియం పనితీరును తగ్గిస్తుంది. ఈ

రెండు పోషకాలు శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడతాయి. అందువల్ల కూల్‌డ్రింక్స్‌కి బదులు సాధారణ ఉష్ణోగ్రతలో ఉన్న మంచినీరు తాగడం ఉత్తమం.

ఊరగాయలు

ఊరగాయలలో అధిక మొత్తంలో ఉప్పు ఉంటుంది. ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల శరీరంలో నీటి పరిమాణం పెరుగుతుందని, దీని వల్ల మీరు బరువు పెరిగే అవకాశం ఉంది. బరువు పెరగడం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుందని తెలుసుకోండి.



డ్రై ఫ్రూట్స్ అతిగా తినడం

డ్రై ఫ్రూట్స్‌లో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది, ఇది జీర్ణక్రియకు మంచిది, అయితే అధిక మొత్తంలో డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల శరీరంలో డీహైడ్రేషన్ ఏర్పడుతుంది, ఎందుకంటే ఫైబర్‌ను జీర్ణం చేయడానికి నీరు చాలా అవసరం పడుతుంది.

పై సూచనలు సాధారణ సమాచార ప్రయోజనాల కోసం మాత్రమే. మీకు ఏవైనా ప్రశ్నలు లేదా ఆందోళనలు ఉంటే, ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.



డీహైడ్రేషన్ లక్షణాలు

- దాహం వేస్తోంది
- అలసట
- తల తిరగడం
- తలనొప్పి
- నోరు, నాలుక పొడిబారడం
- చర్మం పొడిబారడం



- తక్కువ మూత్రవిసర్జన
- మూత్రం డీహైడ్రేషన్ రంగులో ఉండడం

డీహైడ్రేషన్‌ను నిరోధించే మార్గాలు

- తగినంత నీరు త్రాగాలి
- పుచ్చకాయ, దోసకాయ, నారింజ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను తీసుకోవాలి
- కాఫీ మరియు టీ తీసుకోవడం తగ్గించండి
- కార్బోనేటెడ్ డ్రింక్స్ మానుకోండి
- ఊరగాయ వినియోగాన్ని తగ్గించండి
- డ్రై ఫ్రూట్స్‌ని నానబెట్టి తినండి
- స్పైసీ ఫుడ్ వినియోగాన్ని తగ్గించండి
- వ్యాయామం చేసే సమయంలో తగినంత నీరు త్రాగాలి.

గ్యాస్ ఉత్పత్తిని పెంచండి

- రిఫైనరీలకు కేంద్రం ఆదేశం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 6: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ వంట గ్యాస్ లభ్యతపై కేంద్రం కీలక చర్యలు చేపట్టింది. ఎల్పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ఆదేశించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరో రెండు వారాలు కొనసాగితే బ్యారెల్ ముడి చమురు ధర 150 డాలర్లకు పెరిగి ఆర్థిక సంక్షోభం తలెత్తవచ్చని ఖతార్ పెట్రోలియం మంత్రి సాద్ ఆల్ కాబీ హెచ్చరించారు. మరోవైపు, పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు, ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే తెలిపారు. తమ దాడులతో అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఉద్రిక్తతల వేళ తమ పౌరులకు దుబాయ్‌లోని అధికారులు మొబైల్ అలర్ట్ మెసేజీలు పంపించారు. ఇండ్ల నుంచి బయటకు రావొద్దని, అత్యవసర సమయాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు.

16 యేండ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్

- కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, మార్చి 6: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సంచలన ప్రకటన చేశారు. రాష్ట్రంలోని 16 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పిల్లలు మొబైల్ ఫోన్ వ్యసనం బారినపడకుండా అడ్డుకోవడానికే ఈ ముందుజాగ్రత్త చర్యను చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం కర్ణాటక విధాన సౌధలో 20262027 ఆర్థిక సంవత్సరానికి రూ.4.48 లక్షల కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర బడ్జెట్‌ను సీఎం సిద్ధరామయ్య ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, కేంద్ర ప్రభుత్వం కర్ణాటకకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. భారత రాజ్యాంగం నిర్దేశించిన సమాఖ్య వ్యవస్థను కేంద్ర సర్కారు పాటించడం లేదన్నారు. విభిన్న సంస్కృతులకు నెలవైన భారతదేశం వికాస పథంలో పయనించాలంటే సహకార సమాఖ్య వ్యవస్థను పాటించాల్సిందేనని సిద్ధరామయ్య పేర్కొన్నారు. కర్ణాటక ప్రభుత్వ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. 11జీ మోడల్ ఎకానమీ అనే వైవిధ్యమైన, బలమైన, సుస్థిర అభివృద్ధి నమూనాను కర్ణాటక రాష్ట్ర సర్కారు తయారు చేసిందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న 56,432 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియను ఈ ఏడాది మొదలుపెట్టామని వెల్లడించారు. కోర్టు కేసుల వల్ల ఉద్యోగ భర్తీ ప్రక్రియలో జాప్యం జరుగుతున్నందున, అభ్యర్థులకు వయో పరిమితిలో ఐదేళ్ల సడలింపును ఇచ్చామన్నారు. సిద్ధరామయ్య రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇది 17వ సారి. కర్ణాటకలో ఎక్కువసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నేతగా ఆయన రికార్డును సొంతం చేసుకున్నారు. ఇక భారతదేశంలో ఎక్కువసార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నేతల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు.

టెస్టులోనూ తడబడిన వుమెనిండియా

- తొలిరోజు 198 కే ఆలౌట్ చేసిన ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత మహిళల జట్టు.. కంగారూలతో జరుగుతున్న ఏకైక టెస్టులోనూ తడబడింది. బ్యాటింగ్ వైఫల్యం కారణంగా వన్డేల్లో ఆసీస్ చేతిలో క్లీన్‌స్వీప్ అయిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. పెర్త్ వేదికగా శుక్రవారం నుంచి మొదలైన టెస్టులోనూ అదే ఆటతీరును ప్రదర్శించింది. ఒకేరోజు 13 వికెట్లు నేలకూలిన పిచ్‌పై ఆసీస్‌దే పైచేయి అయింది. ఆతిథ్య జట్టు ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ఉమెన్ ఇన్ బ్లూ.. తొలి ఇన్నింగ్స్‌లో 62.4 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌట్ అయింది. జెమీమా రోడ్రిగ్స్ (52) మాత్రమే అర్ధ శతకం సాధించగా షెఫాలీ వర్మ (35), కాశ్వీ గౌతమ్ (34*) ఫర్వాలేదనిపించారు. స్మృతి మంధాన (4), హర్మన్‌ప్రీత్ (18), ప్రతీక (18, దీప్తి (7), రిచా (11) దారుణంగా విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో అన్నాబెల్ సదర్లండ్ (4/46), లుసి హమిల్టన్ (3/31), డార్సీ బ్రౌన్ (2/41) భారత బ్యాటర్ల పనిపట్టారు. భారత ఇన్నింగ్స్‌లో ఏ ఇద్దరి మధ్యా కనీసం 50 పరుగుల భాగస్వామ్యం నమోదుకాలేదు. భారత్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసి ఫస్ట్ ఇన్నింగ్స్‌కు వచ్చిన ఆస్ట్రేలియా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 96 రన్స్ చేసింది. ఎల్లీస్ పెర్రీ (62 బంతుల్లో 43 నాటౌట్, 7 ఫోర్లు), అన్నాబెల్ (29 బంతుల్లో 20 నాటౌట్) క్రీజులో ఉన్నారు. జార్జియా వోల్ (2), లిచ్‌ఫీల్డ్ (9) తక్కువ స్కోరుకే ఔట్ అవగా తన కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ ఆడుతున్న కెప్టెన్ అలిస్సా హీలి (13) విఫలమైంది. పెర్రీ, అన్నాబెల్ ఆ జట్టును ఆదుకున్నారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 38 రన్స్ జోడించి మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆసీస్ ఇంకా 102 పరుగులు వెనుకబడి ఉంది. భారత బౌలర్లలో సయాలి సత్గరె (2/24) రెండు వికెట్లు పడగొట్టింది.

25 నుంచి ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్

గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను కేంద్ర క్రీడాశాఖ నిర్వహించనున్న ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్ (కేఐటీజీ) ఈనెల 25 నుంచి మొదలుకానున్నాయి. కేంద్ర క్రీడా శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్), భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ), నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్స్, ఛత్తీస్‌గఢ్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో మార్చి 25 నుంచి ఏప్రిల్ 6 దాకా జరుగబోయే ఈ క్రీడలను గిరిపుత్రుల రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, జగ్‌దల్‌పూర్, సర్గుజాలో నిర్వహించనున్నారు. ఏడు మెడల్ స్పోర్ట్స్ (అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్చరీ, స్విమ్మింగ్, రెజ్లింగ్)తో పాటు మల్లఖంబ్ (కర్ర ఆధారంగా ఆడే సంప్రదాయ క్రీడ), కబడ్డీ క్రీడలను ఆడించనున్నారు.

హెచ్ సీఏలో ఎన్నికలు

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో ఓవైపు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతుంటే మరోవైపు ఎన్నికల కోలాహలం నెలకొన్నది. దేవరాజ్, ఎస్‌జే శ్రీనివాస్ పదవి కాలం ముగియడంతో ఖాళీ అయిన కార్యదర్శి, కోశాధికారి పదవుల కోసం హెచ్‌సీఏ ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. కీలకమైన ఈ రెండు స్థానాల కోసం వివిధ క్లబ్‌ల నుంచి పలువురు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల ప్రధాన అధికారి వీఎస్ సంపత్‌కు తమ నామినేషన్లు సమర్పించారు. ఇందులో చిట్టి శ్రీధర్, ఆగంరావు, అనిల్‌కుమార్, బాబురావు, హరి నారాయణరావు, అజ్మల్ అసద్, జీవన్‌రెడ్డి రెండు పదవుల కోసం నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 15వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి.

అవినీతిపై విచారణ జరపాలి

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో కోట్ల రూపాయల భారీ అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ డిస్ట్రిక్ అసోసియేషన్(టీడీసీఏ) అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా భేటీలో హెచ్‌సీఏపై వెంకటేశ్వర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'హెచ్‌సీఏలో కొందరు పెద్దలు మాఫియాగా మారారు. కోట్ల రూపాయలు దోచుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధి కోసం బీసీసీఐ కేటాయించిన నిధులను కొల్లగొడుతున్నారు. హెచ్‌సీఏలో పేరుకుపోయిన అవినీతిపై సమగ్ర విచారణ కోసం సీఐడీ, ఏసీబీ, డీజీపీకి ఫిర్యాదులు చేశాం. 2004లో 4 కోట్లు ఇచ్చిన విశాక కంపెనీకి ఇప్పుడు 69 కోట్లు చెల్లించే పరిస్థితి ఎందుకు ఎదురైంది. హెచ్‌సీఏ..మంత్రి వివేక్ జేబు సంస్థగా మారింది. అవినీతిపై విచారణ పూర్తయ్యే వరకు వివేక్ మంత్రి పదవికి దూరంగా ఉండాలి. హెచ్‌సీఏలో కోట్ల కుంభకోణంపై సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ వెంటనే స్పందించాలి. సొసైటీ రిజిస్ట్రేషన్ నుంచి హెచ్‌సీఏ గుర్తింపును రద్దు చేసి..గ్రామీణ క్రికెట్ అభివృద్ధి కోసం టీడీసీఏకు గుర్తింపు ఇవ్వాలని బీసీసీఐని కోరుతున్నాం. ఉద్దేశపూర్వకంగానే హెచ్‌సీఏ గత అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావును అక్రమంగా అరెస్ట్ చేశారు. గత ఎన్నికల్లో ఆయన చేతిలో ఓడిన అమర్‌నాథ్‌ను అధ్యక్షునిగా ఎన్నుకుని నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారు' అని అన్నారు.

ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ రేసులో సంజూ శాంసన్

ముగింపు దశకు చేరుకున్న పొట్టి ప్రపంచకప్‌లో టోర్నీ ఆసాంతం రాణించిన ప్లేయర్లకు అందజేసే 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' కోసం ఐసీసీ శుక్రవారం 8 మందితో కూడిన నామినీలను ప్రకటించింది. జాబితాలో భారత్ నుంచి వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ కూడా చోటు దక్కించుకున్నాడు. అతడితో పాటు ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్, పాక్ ఓపెనర్ షాహిబ్‌జాదా ఫర్హాన్, సౌతాఫ్రికా కెప్టెన్ ఎయిడెన్ మార్క్మ్, పేసర్ లుంగి ఎంగిడి, కివీస్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర, ఓపెనర్ టిమ్ సీఫర్ట్, అమెరికా బౌలర్ షాడ్లే ఉన్నారు. టోర్నీ ఆరంభ దశలో జట్టులో చోటు దక్కని శాంసన్.. సూపర్ 8 దశ నుంచి మాత్రం అదరగొడుతున్నాడు. వెస్టిండీస్‌తో క్వార్టర్స్ ఫైనల్ వంటి పోరులో కెరీర్ అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడిన అతడు.. సెమీస్‌లో అద్భుతంగా రాణించి భారత్ ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించాడు.

గాసిప్స్ పై క్లారిటీ

ప్రస్తుతం టాలీవుడ్‌లో పెళ్లిళ్ల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల విజయ్-రష్మిక వివాహం వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అలాగే మార్చి 6న అల్లు శిరీష్– నయనిక రెడ్డి వివాహం జరగనుండటంతో సినీ వర్గాల్లో పెళ్లి వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. ఇదే సమయంలో హీరోయిన్ మీనాక్షి చౌదరి వ్యక్తిగత జీవితంపై కూడా కొన్ని గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వాటిపై స్పష్టత ఇచ్చారు. తన అందం, నటనతో తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు సంపాదించిన హీరోయిన్లలో మీనాక్షి చౌదరి ఒకరు. ఆసక్తికర విషయం ఏమిటంటే, చాలా మంది నటీనటులు డాక్టర్ అవ్వాలని అనుకుని సినిమాల్లోకి వచ్చామని చెబుతుంటారు. కానీ మీనాక్షి మాత్రం నిజంగానే డెంటిస్ట్ చదివి తర్వాత సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. మొదట మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ సినిమాల్లో ముందుకు సాగారు. 2019లో వచ్చిన హిందీ సినిమా అప్‌స్టార్ట్స్ ద్వారా మొదటిసారి తెరపై కనిపించిన మీనాక్షి, 2021లో వచ్చిన ఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత ఖిలాడీ, హిట్: ది సెకండ్ కేసు, గుంటూరు కారం వంటి చిత్రాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు మాత్రమే కాకుండా తమిళంలో కూడా ఆమె పలు సినిమాల్లో నటించారు. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా నటిస్తున్న 'వృషకర్మ' సినిమాలో మీనాక్షి హీరోయిన్‌గా నటిస్తున్నారు. కొంతకాలంగా మీనాక్షి చౌదరి ఒక తెలుగు హీరోతో రిలేషన్‌లో ఉన్నారని గాసిప్స్ వినిపించాయి. ఆ హీరో మరెవరో కాదు సుశాంత్. వీరిద్దరూ కలిసి నటించినఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమా షూటింగ్ సమయంలో స్నేహం పెరిగి అది ప్రేమగా మారిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా స్పందించిన మీనాక్షి, వాటిని పూర్తిగా ఖండించారు. సుశాంత్‌తో తనకు ప్రేమ సంబంధం లేదని, అతను మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ విషయంపై గాసిప్స్ ఎక్కువ కావడంతో మీనాక్షి టీమ్ కూడా స్పందించి ఇద్దరూ కేవలం ఫ్రెండ్స్ మాత్రమేనని క్లారిటీ ఇచ్చింది.



హ్యాపీ బర్త్‌డే జాన్వీ

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' (Peddi). ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఈరోజు తన 29వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఆమెకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ ఒక స్పెషల్ వీడియోను విడుదల చేసింది. కాటుక అక్కర్లేని ఆ కళ్లు, ముక్కుపుడక అక్కర్లేని ఆ ముక్కు.. అంటే అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరియే ఈ చికిరి.. అంటూ దర్శకుడు బుచ్చిబాబు సనా జాన్వీని ప్రశంసిస్తూ ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో జాన్వీ 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్రలో నటిస్తుంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సహకారంతో వృద్ధి సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 30, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200